ఎగరని ఎర్లీ బర్డ్

- ముందస్తు ఆస్తిపన్ను వసూళ్లలో జాప్యం
- గతేడాది రూ.8కోట్లు..
- ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.4.32 కోట్లు వసూళ్లు

6



బెడిసికొట్టిన ప్లాన్...

- భూ వివాదం కేసులో రూ.4 లక్షలు డిమాండ్ చేసి ఏసీబీకి దొరికిపోయిన మణుగూరు సీఐ
- సీఐ తరఫున మధ్యవర్తిగా టీవీ చానెల్ రిపోర్టర్
- బాధితుడి వద్ద రూ.లక్ష తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- సీఐ సూచనల మేరకే డబ్బులు తీసుకున్నట్టు వెల్లడి
- పక్కా ఆధారాలతో సీఐ సహా రిపోర్టర్ అరెస్టు


ఏసీబీ వలలో చిక్కిన సీఐ సతీష్‌కుమార్, మధ్యవర్తి గోపి (కుడి నుంచి ఎడమకు)

మణుగూరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూ వివాదం ఘటనలో కేసు నమోదు చేస్తానని బెదిరించి, రూ.4లక్షలు డిమాండ్ చేసి మధ్యవర్తి ద్వారా రూ.లక్ష తీసుకున్న వ్యవహారంలో భద్రాద్రి జిల్లా మణుగూరు సీఐ సోమ సతీష్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ మణుగూరు పోలీసుస్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

మణుగూరు మండలంలోని గుట్ట మల్లారం గ్రామానికి చెందిన ఓ భూ వివాదంలో స్థానిక తహసీల్దార్ రాఘవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వ భూమిని కబ్జాచేసి ప్లాట్లు చేసి విక్రయిస్తున్న వారిపై సీఐ సతీష్‌కుమార్ కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో మణుగూరుకు చెందిన బేతంచర్ల వెంకటేశ్వరరావు, అతడి మేనల్లుడు కూరాకుల శ్రీనివాస్‌లను పిలిచి కేసులో మిమ్మల్ని కూడా ఇరికిస్తానని బెదిరించాడు. రూ.4 లక్షలిస్తే కేసు నమోదు చేయనని బేరానికి దిగాడు. సీఐ వేధింపులతో విసుగు చెందిన బాధితులు ఏసీబీని ఆశ్రయించారు.

ఏసీబీ స్కెచ్ ప్రకారం.. సోమవారం బాధితుడు డబ్బులు ఇస్తానని సమాచారం తెలుపగా, సీఐ తరఫున 'బిగ్ టీవీ'అనే చానెల్‌కు రిపోర్టర్‌గా పనిచేస్తున్న మిట్టపల్లి గోపి అనే వ్యక్తి రంగంలో దిగాడు. బాధితుడికి చెందిన గిన్నెల దుకాణం వద్దకు వచ్చి రూ.లక్ష తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని విచారించగా సీఐ సతీష్‌కుమార్ తనకు ఈ పని అప్పజెప్పాడని ఒప్పుకున్నాడు. ఏసీబీ దాడి సమయంలో (మిగతా 6వ పేజీలో)


పట్టుబడిన ద్విచక్రవాహనాలను చూపిస్తున్న ఏసీపీ, సీఐ

జల్సాల కోసం దొంగతనాలు

- ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు
- రూ.12.50 లక్షల విలువైన 18 మోటర్ సైకిళ్లు స్వాధీనం
- నిందితులిద్దరూ ఉమ్మడి జిల్లా వాసులే

పెనుబల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు దొంగిలించి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఖమ్మంజిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర్ ఎస్ఐ కె.వెంకటేష్ పట్టుకున్నారు. సోమవారం వీఎం బంజర్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసీపీ రఘు, రూరల్ సీఐ ముత్తి లింగంతో కలిసి ఈ కేసుకు సంబంధించి వివరాలను వెల్లడించారు.

ఆదివారం సాయంత్రం వీఎం బంజర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్ఐ వెంకటేష్ (మిగతా 6వ పేజీలో)



రైతులకు వరం 'భూ భారతి'

- భూ సమస్యలన్నిటికీ పరిష్కారం
- ఎంపీ ఆర్.రఘురాంరెడ్డి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని రెడ్డిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్లో రెవెన్యూ ఆధ్వర్యంలో భూ భారతిపై రైతులకు, ప్రజలకు సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతు గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో ధరణి పేరిట రైతులను చాలా ఇబ్బంది పెట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏడాది పాటు ఎంతో (మిగతా 6వ పేజీలో)

జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి కృషి

- పాత భవనం మరమ్మతులకు నిధులు : ఎంపీ రఘురాంరెడ్డి
- ఎంపీ లాడ్స్ నిధులతో 8 ఫ్రీజర్ల అందజేత

6

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ... ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆ పార్టీ నేతలకు పరీక్ష కాబోతోంది. పొరుగున ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో సభ జరుగుతున్నందున, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి అధికంగా జనసమీకరణ చేపట్టాలని బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం నిర్ణయించింది. దీంతో ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి జిల్లాలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ప్రస్తుత ప్రజా ప్రతినిధులు జన సమీకరణపై దృష్టిపెట్టారు. నియోజక వర్గాలు, మండలస్థాయి ఇన్‌చార్జిల నియామకంతో పాటు జన సమీకరణకు అవసరమైన కార్యాచరణను బీఆర్ఎస్ సిద్ధం చేస్తోంది.



బీఆర్ఎస్‌కు బలపరీక్ష

వరంగల్ రజతోత్సవ సభకు జన సమీకరణపై దృష్టి

- సన్నాహక సమావేశాలతో నేతలు బిజీ బిజీ
- ఉమ్మడి జిల్లాలో పార్టీ పునరుజ్జీవానికి వ్యూహం
- ఓటమి సంక్షోభం నుంచి తేరుకునేందుకు ప్రయత్నాలు
- నియోజకవర్గాల వారీగా టార్గెట్
- మాజీ ప్రజా ప్రతినిధులపైనే భారం

ఖమ్మం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉమ్మడి జిల్లాలో బలమైన పార్టీగా ఉన్న బీఆర్ఎస్ ఒక్కసారిగా దెబ్బతిన్నది. బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. గతంలో బీఆర్ఎస్ సభ ఎక్కడ జరిగినా అటు తుమ్మల, ఇటు పొంగులేటి జనసమీకరణలో కీలక పాత్ర పోషించే వారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌నుంచి వలస వచ్చిన వారికే కేసీఆర్ టికెట్లు ఖరారు చేయడంతో జిల్లాలో ఒక్కసారిగా బీఆర్ఎస్ పరిస్థితి మారిపోయింది.

నాడు బీఆర్ఎస్‌లో సీనియర్ నేతలుగా ఉన్న తుమ్మల, పొంగులేటి తదితరులు కాంగ్రెస్‌లో చేరడంతో వారి వెంట భారీ సంఖ్యలో సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో జిల్లాలో బీఆర్ఎస్ బలహీనపడింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పది నియోజకవర్గాల్లో భద్రాచలం మినహా అన్నిచోట్ల కారు పార్టీ ఘోరపరాజయం పాలైంది. జిల్లాలో 10 స్థానాల్లో 9చోట్ల ఓడిపోవడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో బీఆర్ఎస్ కేడర్ పూర్తిగా స్తబ్దతకు గురైంది. ఆ తర్వాత వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ నుంచి ఖమ్మంలో నామా నాగేశ్వరావు, మహబూబాబాద్‌లో మాలోతు కవిత ఓడిపోయారు. దాంతో గత ఏడాదిన్నర కాలంగా బీఆర్ఎస్‌లో తీవ్ర స్తబ్దత నెలకొంది. గత ఎన్నికల్లో ఓడిన నాయకులు జిల్లాలో ఏదైనా ముఖ్యమైన సందర్భం ఉంటే తప్ప ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పెద్దగా పాల్గొనలేదు.

వారిపైనే భారం..

ఇక బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర తిరిగి రాజ్యసభకు ఎన్నికకావడం, గతంలోనే ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీగా ఉన్న ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధుసూదన్ మాత్రమే ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నుంచి ప్రజా ప్రతినిధులు ఉన్నారు. బండి పార్థసారథిరెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత పూర్తిగా వ్యాపారంపైనే దృష్టిసారించారు. ప్రస్తుతం మాజీ మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోతు మదన్‌లాల్, చంద్రావతి, కొండబాల కోటేశ్వరరావు, బానోతు హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, రేగా కాంతారావు, జడ్పీ మాజీచైర్మన్ లింగాల కమల్‌రాజ్‌లు ఆయా నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లుగా పార్టీ వ్యవహారాలను నడిపిస్తున్నారు. వారు కూడా ప్రధానమైన సందర్భాల్లో తప్ప మిగిలిన సందర్భాల్లో జిల్లాలో కనిపించడం లేదు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగ (మిగతా 6వ పేజీలో)

యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం..

- గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం పెరిగిపోయింది
- పరిశ్రమలను రప్పించి తద్వారా ఉద్యోగాలను సృష్టిస్తాం
- మరో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కసరత్తు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- మధిరలో భారీ ఎత్తున మెగా జాబ్‌మేళా
- 2,235 మందికి ప్రైవేటు సంస్థల నియామక పత్రాలు


మధిరలో తొలి నియామక పత్రాన్ని అందజేస్తున్న భట్టి

మధిరటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): 'రాబోయే రోజుల్లో మధిర భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పేందుకు ఇప్పటికే ఇండస్ట్రియల్ పార్కులు మంజూరు చేశాం. తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి..' అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మధిరలోని రెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రజా ప్రభుత్వంలో ఇప్పటికే 56 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 30 వేల ఉద్యోగాల భర్తీకి కసరత్తు జరుగుతోందని, మల్టీ నేషనల్ కంపెనీలకు రాష్ట్రంలో అవసరమైన వనరులు కల్పించి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించి తద్వార యువతకు ఉద్యోగ అవకాశాలు లభించేలా చూడటం జరుగుతుందని అన్నారు.

రాష్ట్రంలో 65 ఐటీఐలను యువతకు అవసరమైన నైపుణ్యాన్ని అందించేలా వాటిని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లగా అప్‌గ్రేడ్ చేయటం జరిగిందని యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ (మిగతా 6వ పేజీలో)



కర్ఫ్యూని తలపిస్తున్న ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్

వాతావ'రణం'

- పగలంతా ఎండలు... రాత్రి అకాల వర్షాలు
- ఉక్కపోతతో సతమతం
- భిన్న వాతావరణ పరిస్థితుల్లో జనం పరేషాన్
- రోజు రోజుకూ పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- సోమవారం అత్యధికంగా బాణాపురంలో 41.5 డిగ్రీల నమోదు

ఖమ్మం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులు విభిన్నంగా ఉంటూ పరేషాన్ చేస్తున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు మండిపోతుండగా.. దానికి తోడు ఉక్కపోత మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇక సాయంత్రం సమయాల్లో ఏ ప్రాంతంలో ఎప్పుడు వర్షం పడుతుందో కూడా తెలియని పరిస్థితులు ఉంటున్నాయి. అప్పటివరకు సాధారణంగా ఉన్న వాతావరణం, ఒక్కసారిగా గాలి దుమారంతో కూడిన వర్షంగా మారుతుండటంతో రైతులు నష్టపోతున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన పంటలను కాపాడుకునేందుకు టార్పాలిన్‌లు ఏర్పాటు చేసుకునే సమయం కూడా ఉండటం లేదు. అంతేకాదు రాత్రి సమయంలో ఎంతటిస్థాయిలో వర్షాలు పడినప్పటికీ పగటివేళ్లలో మాత్రం ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు.

ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు ఆటోమెటిక్ వాతావరణ కేంద్రాల్లో నమోదైన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి ఖమ్మం జిల్లాలోని వైరాలో 4.8 సెం.మీ., కొణిజర్లలో 3.2 సెం.మీ., రఘునాథపాలెంలో 2.8 సెం.మీ., తల్లాడలో 1.4 సెం.మీ. వర్షపాతం నమోదవగా.. కారేపల్లి, కామేపల్లి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఏన్కూరు మండలాల్లో జల్లులు పడ్డాయి. భద్రాద్రి జిల్లాలో (మిగతా 6వ పేజీలో)


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మాజీ వైస్ ఎంపీపీ రమేష్

ఇందిరమ్మ ఇల్లు రాలేదని..

- బోనకల్ మాజీ వైస్ ఎంపీపీ గుగులోతు రమేష్ ఆత్మహత్యాయత్నం
- 'పంచాయతీ' ఎదుట ఘటన

బోనకల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అన్ని అర్హతలు వున్నా తనకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని, అధికారుల నిర్లక్ష్యం వల్ల అనర్హుడిగా మిగిలానంటూ బోనకల్ మాజీ వైస్ ఎంపీపీ గుగులోతు రమేష్ సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేశాడు. అక్కడ ఉన్న వారు అడ్డుకుని వారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే సమయంలో అధికారులు తనకు ఇల్లు ఉన్నట్టు నమోదు చేయడం వల్ల ఇళ్ల మంజూరు జాబితాలో పేరు రాలేదని వాపోయారు. తాను గత కొన్ని సంవత్సరాలుగా అద్దెకు ఉంటున్నానని, ఇల్లు మంజూరైతే కష్టాలు తీరతాయని భావించానని పేర్కొన్నారు. ఇళ్ల మంజూరు జాబితాలో తన పేరు రాకపోవడానికి కారణం అధికారులేనని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధిగా ఇప్పటి వరకు వైస్ ఎంపీపీ హోదాలో పని చేశానని, గిరిజన కుటుంబానికి చెందిన తనకే ఇల్లు రాని పరిస్థితి బాధను కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిజమైన అర్హులను పరిగణనలోకి తీసుకొని జాబితాలను సరి చేయాలని కోరారు.

ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలి

- ముగ్గురు మంత్రులు ఉమ్మడి జిల్లాకు మూడు పైసలు తేలే
- భద్రాచలానికి ఉప ఎన్నికొస్తే బీఆర్ఎస్‌దే గెలుపు
- కేసీఆర్‌కు, కార్యకర్తలకు వారధిగా ఉంటా
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


భద్రాచలంలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కవిత

భద్రాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశలను అడియాసలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల కోసం ఎక్కడికక్కడ నిలదీయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భద్రాచలంలో సోమవారం తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో అలవి కాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ ప్రజలను అన్నింటా వంచిస్తోందని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన కేవలం 18 నెలల్లోనే రూ.1.60 లక్షల కోట్లు అప్పు తెచ్చి ప్రశ్నిస్తే బుకాయిస్తోందని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా వివరాలు చెప్పమని మేము ప్రశ్నిస్తే ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నుంచి సమాధానం లేదన్నారు. ఇది ప్రజాస్వామ్యమని ఖర్చు చేసిన ప్రతీ రూపాయికి ప్రజలకు అర్థమయ్యేలా వివరాలు చెప్పాలని స్పష్టం చేశారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు రాష్ట్ర మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్నా ఉమ్మడి జిల్లాకు మూడు పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో రాష్ట్రస్థాయిలో బీఆర్ఎస్‌కు తక్కువ స్థానాలొచ్చినా భద్రాచలంలో బీఆర్ఎస్ గెలుపు రికార్డన్నారు. భద్రాద్రి నుంచి బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ తెల్లం వెంకటరావు కాంగ్రెస్‌లో చేరిన ద్రోహి అని పేర్కొన్నారు. అటువంటి ద్రోహులను, కుట్రదారులను చాలా మందిని చూశామన్నారు. భద్రాచలం అసెంబ్లీకి ఉప ఎన్నిక వస్తే గులాబీ జెండాను ఎగురవేస్తామని మీరు వాగ్దానం చేయాలని కార్యకర్తలను కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2.50 లక్షల రైతులు ఉంటే, 4.25 లక్షల మంది రైతు కూలీలు ఉండగా ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఎంత మందికి రైతు భరోసా ఇచ్చారు అంటూ ముగ్గురు మంత్రులను ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇప్పటికీ 60 శాతం మందికి రుణమాఫీ, 50 శాతం మందికి రైతు భరోసా రాలేదని విమర్శించారు.

2004లో పీనుగలా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆనాడు టీఆర్ఎస్‌తో పొత్తుపెట్టుకొని కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. సీతారామ ప్రాజెక్టును నిర్మించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 3.5 లక్షల ఎకరాలకు కేసీఆర్ నీళ్లు అందించిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం పుట్టిందే ఖమ్మం జిల్లాలో అని మరోసారి తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం పోరాటం చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు చంద్రావతి, హరిప్రియ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిండిగాల రాజేందర్, రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు భద్రాద్రి రామయ్యను ఎమ్మెల్సీ కవిత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, హరిప్రియ, చంద్రావతి, దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు భద్రాద్రి జిల్లా స్థాయి

జాబ్ మేళా

జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్

చుంచుపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాస్థాయి జాబ్ మేళాను బుధవారం నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదారాబాద్ ప్రాంతంలోని మేడ్చల్‌లో పని చేయుటకు కె.ఎల్ గ్రూప్ వారు ఆసక్తి గల నిరుద్యోగ యువకులతో జిల్లాలో 200 పోస్టుల భర్తీకి ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళా పాల్వంచలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థుల వయస్సు 19 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలని, వారి విద్యార్హత పది, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులు అయిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు తమ పేర్లను 9248099033 ఫోన్ నెంబర్‌ను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 673మంది

21మంది మైనర్ డ్రైవర్లపై కేసులు

ఖమ్మంక్రైం, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నెల 20రోజుల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 673మంది వ్యక్తులను డ్రంక్‌అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారని అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 21మంది మైనర్లపై కేసులు నమోదు చేసినట్టు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసుకమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాలకు శిక్షవేసిన వారవుతారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పని హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిని వారిపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తున్నామన్నారు. ఇప్పటికే పలువరికి ఒకరోజు చొప్పున జైలుశిక్ష/జరిమాన విధించారన్నారు. ఇటీవల నగరంలో వాహనాల తనిఖీలలో మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నారని తెలిపారు.

అటువంటి మైనర్ల తల్లిదండ్రులపై కేసులు నమోదుచేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా న్యాయమూర్తి జరిమాన విధిస్తూతీర్పు వెల్లడించినట్టు తెలిపారు. మైనర్ డ్రైవింగ్, డ్రంకన్‌అండ్‌డ్రైవ్ తనిఖీలుపై ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని ఆ ప్రకటనలో సీపీ పేర్కొన్నారు.

మనం చేసే తప్పిదాలు మన మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యం కోరలు చాస్తోంది. పరిశ్రమలు, వాహన కాలుష్యంతో పాటు ప్రతిదానికి పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగం, పెరిగిపోతున్న జనాభా, పరిశ్రమలు, ఇలా అన్నీ కలిసి సరికొత్త పర్యా'మారణాన్ని' సృష్టిస్తున్నాయి. తినే తిండి, తాగేనీరు, పీల్చే గాలి.. ఇలా అన్నింటా కలుషితమే రాజ్యమేలుతోంది. ఫలితంగా నేల ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తోంది. సారవంతమైన భూములు నిస్సారంగా మారుతున్నాయి. ఈ కారణంగానే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఫలితంగా సకాలంలో వర్షాలు కురవడం లేదు. భూతాపం పెరిగి ఎండలు మండిపోతున్నాయి. ఇలా నేల ఆరోగ్యం దెబ్బతిని ఇది ప్రకృతి ప్రకోపంగా మారుతోంది. మానవాళి మనుగడపై ఇది తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఈ నెల 22న ధరిత్రి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



భూమాతకు కాలుష్య కాటు

- నేల ఆరోగ్యంపై కొరవడిన ముందుచూపు
- నేడు ధరిత్రి దినోత్సవం

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల కాలుష్య తీవ్రతా అధికంగానే ఉంటోంది. తాగేనీరు పరిశుభ్రంగా ఉండటం లేదు. అంతటా కాంక్రీటు నిర్మాణాలు చోటు చేసుకుంటుండటంతో చుక్క నీరు ఎక్కడా భూమిలో ఇంకే పరిస్థితి లేదు. ఈ ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నీళ్ల రంగు మారుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉత్పన్నమవుతోంది. రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా గిరిజనులకు రక్షిత నీరు కరువవుతోంది. కలుషిత నీరే దిక్కవుతోంది. గృహాలు, పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థాలను పట్టణ ప్రాంతాల్లో సమీప నీటి వనరుల్లోకి వదిలేస్తున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వాయు, జలకాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. గత పదేళ్లలో పట్టణ ప్రాంతంలో జనాభా విపరీతంగా పెరిగింది. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు పెరిగాయి. పరిశ్రమల స్థాపన బాగా జరిగింది. ద్విచక్రవాహనాల వినియోగం అధికమైంది. కాలం చెల్లిన వాహనాలనూ రోడ్లపైన తిప్పుతుండటంతో వాయు కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతోంది. ముఖ్యంగా కార్బన్ మోనాక్సైడ్ స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన పరిమితి కన్నా 50 రెట్లు అధికంగా ఉన్నట్టు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాలిథిన్ భూతం పర్యావరణానికి శాపం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ లాంటి కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నా క్షేత్రస్థాయిలో ఇంకా ఆశించిన మార్పులు, ఫలితాలు రావడం లేదు. ఏ పట్టణం, గ్రామం చూసినా చెత్త, వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతి అవసరానికీ ప్లాస్టిక్, పాలిథిన్ సంచులను వినియోగించడంతో పరిస్థితి మరింత విషమంగా మారుతోంది. పంచాయతీ, పురపాలికల వారు శుభ్రం చేస్తారన్న ధీమాతో ఎవరికి వారు వారి ఇళ్లలోని చెత్తను వీధుల్లో పోసి వదిలేస్తున్నారు. దీంతో ఏ వీధి చూసినా కాగితాలు, తగరపు డబ్బాలు, గాజు సీసాలు, ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువులే అధికంగా ఉంటున్నాయి. కొన్ని రకాల వస్తువులు భూమిలో కలవకపోవడం వల్ల నేల కాలుష్యానికి గురవుతోంది.

జీవ వైవిధ్యాన్ని కాపాడాలి

మానవాళి మనుగడకు ఆరోగ్యవంతమైన నేల, జీవవైవిధ్యం రెండు కళ్లలాంటివి. వీటికి అనుగుణంగా అందరూ జీవనశైలిని మార్చుకోవాలి. వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. రసాయనిక కాలుష్యాన్ని అరికట్టి భూతాపాన్ని తగ్గించాలి. మొక్కల పెంపకాన్ని విధిగా భావించాలి. ప్రధానంగా సౌర, పవనశక్తి, బయోమాస్, హైడల్ ఇంధన వనరులను ఉపయోగించాలి. పర్యావరణ పరిరక్షణపై అందరికీ అవగాహన ఉండాలి. ఏ పని చేస్తున్నా పర్యావరణానికి హాని తలపెట్టని వస్తువులనే వినియోగించాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. అప్పుడే భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీటితోపాటు ఆరోగ్యవంతమైన నేలను ఆ ప్రకృతి మనకు అందించే వీలుంది.

నా కూతుర్ని అల్లుడే చంపాడు

పోలీసులకు మృతురాలి తండ్రి ఫిర్యాదు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నా కూతురు హాసీనా బేగం(38)ను అల్లుడు అమీన్ ఖాన్ హతమార్చి ప్రమాదవశాత్తు మృతిగా చిత్రీకరించాడని పేర్కొంటూ మృతిరాలి తండ్రి షేక్ అమీద్ సోమవారం మణుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు సంబంధించి సీఐ సతీస్‌కుమార్ తెలిపిన వివరాలు... మణుగూరుకు చెందిన సింగరేణి ఉద్యోగి అమీన్‌ఖాన్‌కు 15 ఏళ్ల కిత్రం కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి గ్రామానికి చెందిన అమీద్ కుమార్తె హాసీనా బేగాన్ని ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఈనెల ఆరో తేదిన ఉదయం తన అల్లుడు ఫోన్ చేసి తన భార్య బాత్ రూంలో పడిపోయిందని, మణుగూరు నుంచి కొత్తగూడెం సింగరేణి ఆసుపత్రికి తీసుకువస్తున్నట్లు సమాచారం ఇచ్చాడు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్ తరలించారు. హాసీనాకు బ్రెయిన్ డెడ్ కావడంతో ఈనెల 11న మృతి చెందింది. మృత దేహాన్ని చుంచుపల్లి శ్మశాన వాటిలో పూడ్చి పెట్టారు. తర్వాత రెండు రోజులకు మృతురాలి ఇద్దరు పిల్లలు ఈ నెల 5 రాత్రి అమ్మనాన్న గోడవ పడ్డారు నాన్న అమ్మను బలంగా గోడకు వేసి కొట్టడంతో తలకుదెబ్బ తగిలిపడిపోయిందని తెలుపగా షేక్ అమీద్ తన అల్లుడిపై మణుగూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అల్లుడు తీవ్రంగా తన కూతుర్ని కొట్టడం వల్లే మృతి చెందిందని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ సతీష్ కుమార్ చుంచుపల్లి వెళ్లి పూడ్చిపెట్టిన మృత దేహాన్ని స్థానిక రెవెన్యూ అధికారుల సమక్షంలో వెలికి తీయించి పోస్టుమార్టం నిర్వహించారు. మెడికల్ రిపోర్టు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

ఎస్‌పీఎఫ్ సిబ్బందిని అభినందించిన డీజీ

భద్రాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో శ్రీరామనవమి, పట్టాభిషేకం సమయంలో విధులు నిర్వహించిన ఎస్‌పీఎఫ్ సిబ్బందిని రాష్ట్ర ఎస్‌పీఎఫ్ డీజీ అనిల్‌కుమార్ అభినందించారు. హైదరాబాద్‌లో డీజీని భద్రాచలం రామాలయ ఎస్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుళ్లు గుంజా శ్రీను, నర్సింహులు ఎస్‌పీఎఫ్ కమాండెంట్ త్రినాథ్ నేతృత్వంలో కలిశారు. ఈ సందర్భంగా నవమి, పట్టాభిషేకం సమయంలో ఎస్‌పీఎఫ్ సిబ్బంది సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమయంలో డీజీకి ఎస్‌పీఎఫ్ కమాండెంట్ త్రినాథ్, హెడ్ కానిస్టేబుళ్లు పట్టాభిషేకం చిత్రపటంను, ముత్యాల తలంబ్రాలను అందజేశారు.

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

చుంచుపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించుటకు శిక్షకులను, సీనియర్ క్రీడాకారులను నియమించినట్లు డీవైఎస్‌వో పరందామరెడ్డి సోమవారం తెలిపారు. ఈ క్రీడా శిక్షణ శిబిరాలు వచ్చే నెల మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు ఉదయం సాయంత్రం వేళల్లో జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన మైదానాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిక్షణ శిబిరాల్లో అవలంభించవలసిన విధి విధానాలు క్రీడాకారులకు సూచించవలసిన శిక్షణపై సలహాలు సూచనలు అందించారు. ఈ శిబిరంలో 14 సంవత్సరాల లోపు బాల బాలికలు వారికి నచ్చి క్రీడలు ఎంచుకొని శిక్షణను కొనసాగించవచ్చని తెలిపారు. ప్రతీ ఏడాది జిల్లా వ్యాప్తంగా 10 క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామని, కానీ ఈ ఏడాది వాటి సంఖ్యను 30కి పెంచామని సూచించారు. కావున ఆసక్తిగల బాల బాలికలు తమకు నచ్చిన క్రీడలో శిక్షణను పొందవచ్చని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అథ్లెటిక్స్ -5, ఫుట్‌బాల్ -3, వాలీబాల్ -2, టేబుల్ టెన్నిస్-2, క్రికెట్ -2, చెస్-1, లాన్‌టెన్నిస్-1, హాకీ-2, బాక్సింగ్ -2, రైఫిల్ షూటింగ్-1, తైక్వాండో -2, ఉషు -1, సాఫ్ట్ బాల్-1, రెజ్లింగ్ -1, యోగా-1, కరాటే - 1, బాస్కెట్‌బాల్- 1, ఆత్యపత్య -1, క్రీడా శిబిరాలు ఉన్నట్లు తెలిపారు.

గిరిజన సంప్రదాయాలను నేటితరం ఆచరించేలా కృషి చేస్తున్నాం

భద్రాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన పాఠశాలల్లో చదివే గిరిజన విద్యార్థులు గిరిజన సంప్రదాయాలను ఆచరించేలా కృషి చేస్తున్నామని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం బాలుర ఆశ్రమ పాఠశాలలో రూ.25.50 లక్షలతో నిర్మించిన ప్రీ ఫ్యాబ్రికేటెడ్ భోజనశాలను పీవో బి.రాహుల్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యాభ్యాసంతో పాటు వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని విద్యార్థులు తల్లిదండ్రులు మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదివి వృద్ధిలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, ఏటీడీవో అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

జల్సాల కోసం దొంగతనాలు

(5వ పేజీ తరువాయి)

తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఖమ్మం వైపు నుంచి రెండు మోటర్‌సైకిళ్లపై వస్తున్న ఇరువురు వ్యక్తులను ఆపి తనిఖీలు చేయగా మోటర్‌సైకిళ్లకు సంబంధించి ఎటువంటి పత్రాలు చూపకుండా తడబడుతూ సమాధానం సరిగా చెప్పనందున ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అర్బన్ కాలనీకి చెందిన మక్కెళ్ల నాగరాజు, ఖమ్మంజిల్లా సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన చల్లా శివప్రసాద్ అని వీరిరువురు సత్తుపల్లిలోని ద్వారకాపూరి కాలనీలో గత కొంతకాలంగా నివాసముంటూ పలుచోట్ల ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్నారు. వీఎంబంజర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడు మోటర్‌సైకిళ్లు, సత్తుపల్లిలో మూడు, వేంసూరు పరిధిలో మూడు, ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లా పెద్దవేగిలో ఒక ద్విచక్రవాహనంతోపాటు అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో నాలుగు ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. దొంగిలించిన మోటర్‌సైకిళ్లకు నెంబర్‌ప్లేట్లు మార్చి బంధువులకు, తెలిసినవారికి విక్రయిస్తూ రూ.12.50లక్షలరాగా వాటిని ఇరువురు చెరిసగం పంచుకొని మద్యం తాగి, కోడిపందాలు, పేకాట వంటి వాటిని ఆడి ఖర్చుపెట్టుకున్నారు.

వీఎంబంజర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ పంజాబీదాబా, తిరువూరు రోడ్డులోని హోటల్ ఎదుట దొంగిలించిన రెండు మోటర్‌సైకిళ్లను వీఎంబంజర్ ఎన్నెస్పీ కాల్వ పక్కన దాచిపెట్టి ఆదివారం సాయంత్రం వాటిని తీసుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజాపురం వెళ్లి బంధువులకు అమ్ముకోవాలని వెళ్తున్నట్లు చెప్పారు.


దొంగిలించిన మోటర్‌సైకిళ్లను పెనుబల్లి మండలం గంగదేవిపాడు గ్రామంలో ఒర్సు వెంకటనారాయణ, పందిళ్ల సింహాద్రి, తిరుమలకొండ కొండల్‌రావు, బత్తుల కొండల్‌రావు అనే వారికి, అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం గ్రామానికి చెందిన దేరంగుల నాగసాయి, ఉప్పతల సతీష్, ఉప్పలత గోపి, ఉప్పలత రాజులతోపాటు మిగిలిన ద్విచక్రవాహనాలను కూడా వారి బంధువులకు విక్రయించారు.

దొంగిలించిన ఇరువురి దొంగలతోపాటు కొనుగోలు చేసిన వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఏసీపీ రఘు తెలిపారు. ఈమేరకు నాగరాజు, శివప్రసాద్‌లను అరెస్టు చేసి సత్తుపల్లి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఏసీపీ వివరించారు. ఈ కేసును ఛేధించడంలో నైపుణ్యం ప్రదర్శించిన సీఐ ముత్తి లింగం, ఎస్ఐ కె.వెంకటేష్‌లను అభినందించడంతోపాటు కానిస్టేబుళ్ల ఎస్.రాజమల్లు, బి.వెంకటేశ్వర్లు(బీవీ), జి.బాలకృష్ణ, ఎండీ.పాషాలకు రివార్డులను ఏసీపీ అందజేశారు.

ఎగరని ఎర్లీ బర్డ్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎర్లీబర్డ్ పథకం ద్వారా మునిసిపాలిటీలు ముందస్తుగా ఆస్తిపన్ను వసూళ్లకు రాష్ట్ర ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. వార్షిక ఆదాయంలో 25శాతం వరకు ఎర్లీబర్డ్ పథకం ద్వారా వసూళ్లు చేయాల్సి ఉంటుంది. ఇలా ముందస్తు చెల్లింపులు చేసిన ప్రాపర్టీ ట్యాక్స్‌లకు ప్రభుత్వం 5శాతం రాయితీ అందిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి 30వరకు ఎర్లీబర్డ్ పథకం అమలులో ఉంటుంది. అయితే రెవెన్యూ అధికారుల తప్పిదాలతో ఖమ్మం నగర పాలక సంస్థలో ముందస్తు చెల్లింపులు చేసిన వారికి గత రెండేళ్లుగా ముప్పుతిప్పలు పెట్టారు. నేరుగా డబ్బులు చెల్లించినా కూడా సీడీఎంఏ స్థాయిలో నమోదు కాకపోవటంతో ఆ ప్రభావం ఈ సంవత్సరం ఎర్లిబర్డ్ పథకంపై పడింది.

ఖమ్మం నగరంలోని సీనియర్ సిటీజన్లు సెలవు రోజుల్లో కూడా కేఎంసీ కార్యాలయానికి వచ్చి ఎర్లీబర్డ్ పథకం కోసం డబ్బులు చెల్లిస్తున్నారు. 2023-2024ఏడాదికి గాను వార్షిక ఆదాయ వసూళ్ల లక్ష్యం రూ.30 కోట్లు కాగా గత ఏప్రిల్‌లో నిర్వహించిన ఎర్లీబర్డ్‌లో రూ.8కోట్ల ఆదాయం రాబట్టారు. తర్వాత ఆదాయ వసూళ్ల లక్ష్యానికి మంచి జరిగాయి. గతేడాది కంటే ఈ సంవత్సరం ఖమ్మం నగర పాలక సంస్థకు రెగ్యూలర్ బిల్ కలెక్టర్లు, కార్యాలయం అసిస్టెంట్‌లను రెవెన్యూ కలెక్షన్‌కు భారీగా పెరిగారు. 2025-2026 ఎర్లీబర్డ్ పథకం ద్వారా రూ.12 కోట్ల వరకు వసూళ్ల అవకాశాలు ఉన్నాయి. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో 51,346 ప్రాపర్టీలు ఎర్లీబర్డ్ పథకానికి అర్హత కలిగి ఉన్నాయి. కానీ కేఎంసీ రెవెన్యూ అధికారులు రూ.9 కోట్లు ముందస్తు వసూళ్ల లక్ష్యం పెట్టుకున్నారు. ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 21 వరకు కేవలం 9,100 ప్రాపర్టీల నుంచి రూ.4.32 కోట్ల ఆదాయ వసూళ్ళు మాత్రమే జరిగాయి. మరో 8రోజులు మాత్రమే ఎర్లిబర్డ్ ముగింపుకు గడువు ఉంది. కానీ లక్ష్యానికి తగిన విదంగా ముందస్తు ఆదాయ వసూళ్ల జరగటం లేదని తెలుస్తోంది. ఎర్లీబర్డ్ లక్ష్యాలు పూర్తిపై కేఎంసీ ఆర్వో శ్రీనివాసరావును వివరణ కోరగా ఇప్పటి వరకు రూ.4.32 కోట్లు ఆదాయ వసూళ్ల జరిగాయని, నెల చివరి వరకు లక్ష్యం పూర్తి చేస్తామన్నారు. ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.



ఆదాయపన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

వాతావ'రణం'

(5వ పేజీ తరువాయి)

చండ్రుగొండ మండలం మద్దుకూరులో 4.6సెం.మీ., పాల్వంచ సీతారామపట్నంలో 2.7సెం.మీ., మణుగూరులో 2.1 సెం.మీ., ముల్కలపల్లిలో 2.2, సుజాతనగర్‌లో 1.4, టేకులపల్లి మండలం 1.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఇక ఉష్ణోగ్రతల విషయానికొస్తే ఖమ్మం అర్బన్‌లో 40.4 డిగ్రీలు, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం, కొణిజర్ల, కూసుమంచి మండలాల్లో 40.2, కల్లూరులో 40.1 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొత్తగూడెం జిల్లాలో చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడు, సుజాతనగర్ 40.8, టేకులపల్లి మండలం కోయగూడెం, గుండాలలో 40.6, ముల్కలపల్లిలో 40.5, పాల్వంచ మండలం యానంబైలులో 40.4, భద్రాచలం, అన్నపురెడ్డిపల్లి మండలం పెట్లంలో 40.3, దుమ్ముగూడెంలో 40.2, కరకగూడెం, లక్ష్మీదేవిపల్లి, చండ్రుగొండలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సోమవారం అత్యధిక ఉష్ణోగ్రతలు ఇలా...

ఖమ్మం జిల్లాలో సోమవారం అత్యధికంగా ముదిగొండ మండలం బాణాపురంలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నేలకొండపల్లిలో 41.3 డిగ్రీలు, ముదిగొండ మండలం పమ్మిలో 41.2, ఎర్రుపాలెంలో 41 డిగ్రీలు, చింతకాని, మధిరలో 40.9, కామేపల్లి మండలం లింగాల, కారేపల్లి గేట్ 40.7 డిగ్రీలు, ఖమ్మం అర్బన్ మండలం ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ పరిధిలో 40.6, బోనకల్లు మండలం రావినూతలలో 40.6, చింతకాని మండలం నాగులవంచలో 40.4 డిగ్రీలు, రఘునాథపాలెం, మధిర ఎఆర్‌ఎస్, వేంసూరు 40.3 డిగ్రీలు, మధిర మండలం సిరిపురం, వైరాలో 40.2, తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో 40.1, సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

బీఆర్‌ఎస్‌కు బల'పరీక్ష'

(5వ పేజీ తరువాయి)

సభకు జనసమీకరణ చేయాల్సిన బాధ్యత ఈ నేతలపైనే పడింది. అధికార పార్టీ బలాన్ని అధిగమించి వీరు ఏ మేరకు జనసమీకరణ చేస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పునర్నిర్మాణంపై దృష్టి..జు

రజతోత్సవ సభతో ఉమ్మడి జిల్లాలో పార్టీ పునర్నిర్మాణంపై బీఆర్‌ఎస్ దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో ఈ సభకు ఉమ్మడిజిల్లా నుంచి కనీసం 50 నుంచి 60వేల మందిని తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి. ఇందుకోసం ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, కార్లను సమకూర్చుకుంటున్నారు. సభకు వెళ్లే ముందు మండల, గ్రామ స్థాయిలో పార్టీ జెండావిష్కరణలు చేయనున్నారు. నియోజకవర్గాల వారీగా జనాన్ని తరలించేందుకు బీఆర్‌ఎస్ కసరత్తు చేస్తోంది. రజతోత్సవ సభ ద్వారా పార్టీలో నెలకొన్న స్తబ్ధతను తొలిగించి కేడర్‌ను స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఆయా నియోజకవర్గాల్లో పాతనేతలతో పాటు కొత్త నేతలను కూడా పార్టీలోకి ఆహ్వానించేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నాలు ప్రారంభించింది.

రజతోత్సవ సభ నేపథ్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఉమ్మడి జిల్లాలో పర్యటించి కార్యకర్తలతో సమావేశమయ్యారు. సభకు ఖమ్మం జిల్లా నుంచి భారీ సంఖ్యలో జనం తరలిరావాలని కోరారు. రజతోత్సవ సభతో బీఆర్‌ఎస్‌లో కొత్త కళ కనిపిస్తుండగా ఈ సభకు జన సమీకరణ చేయడం ఆ పార్టీ నేతలకు పరీక్షగా మారింది.

బెడిసికొట్టిన ప్లాన్...

(5వ పేజీ తరువాయి)

బయట ప్రాంతంలో ఉన్న సీఐని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని మణుగూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ సతీష్‌కుమార్‌తో పాటు అతడికి మధ్యవర్తిగా వ్యవహరించిన గోపిని విచారించిన తరువాత కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు.

అవినీతిపరుల్లో అలజడి

ఏసీబీ అంటేనే జిల్లాలోని అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కాసుల కోసం కక్కుర్తి పడుతూ పక్కదారి పడుతున్న అధికారుల గుండెల్లో ఏసీబీ డీఎస్పీ రమేష్ సింహ స్వప్నంగా మారారు. గతంలో కొత్తగూడెం ప్రాంతంలో ఎస్ఐగా విధులు నిర్వహించి నిజాయితీ నిబద్ధతలకు మారుపేరుగా నిలిచి రౌడీషీటర్లను హడలెత్తించిన రమేష్‌ను నాడు అక్కడి ప్రజలు 'శివమణి' అని పిలుచుకునే వారు. ఇప్పుడు ఏసీబీ శాఖకు వచ్చిన తర్వాత జిల్లా వ్యాప్తంగా వ్యవసాయం, పోలీసు శాఖల్లో జరిపిన దాడుల్లో అశ్వాపురం మండలంలో వ్యవసాయ అధికారిని, భద్రాచలంలో పోలీసు సీఐను లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ప్రస్తుతం మణుగూరు సీఐని అవినీతి కేసులో పట్టుకోవడంతో పోలీసుశాఖతో పాటు అన్ని శాఖల్లోని అవినీతి అధికారుల్లో అలజడి మొదలైంది.

రైతులకు వరం 'భూ భారతి'

(5వ పేజీ తరువాయి)

శోధించి భూ భారతి చట్టాన్ని రూపొందించారని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా అసైన్డ్, సీలింగ్, సాదా బైనామా తదితర భూ సమస్యలకు కచ్చితంగా పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంచార్జ్ కలెక్టర్ శ్రీజ మాట్లాడుతు భూ సమస్యలలో చాలా వరకు పరిష్కార మార్గాలను భూ భారతి చట్టంలో పొందుపర్చడం జరిగిందన్నారు. మ్యూటేషన్, ఓఆర్సీస్, ఇనాం భూములకు, భూ టైటిల్స్ సంబందించిన ఫిర్యాదులు ఏమైనా ఉంటే మన జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రజలు అందించిన దరఖాస్తులను పరిశీలించి రెవిన్యూ డివిజన్ అధికారి, జిల్లా కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్, భూమి ట్రిబ్యూనల్‌లో అప్పీల్ చేసుకోవచ్చిన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీవో నరసింహరావు, తహసీల్దార్ రాంప్రసాద్, జిల్లా వ్యవసాయాదికారి పుల్లయ్య, ఎంపీడీవో కుమార్, కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి, మద్ది మల్లారెడ్డి, వీరారెడ్డి, కిశోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి కృషి

- ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి, రోగులకు మర్నిన సౌకర్యాలు కల్పించేందుకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మార్చురీకి ఎంపీ లాడ్స్ నిధులు రూ.8లక్షలతో కేటాయించిన ఎనిమిది ఫ్రీజర్లను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ ను పరిశీలించారు. వైద్యాధికారుల విజ్ఞప్తి మేరకు స్పందించి రెండు బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ద్వారా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఫ్రీజర్ల కొరత ఉన్నట్లు తెలిసిందని మంత్రి సూచన మేరకు ఎంపీ ల్యాడ్స్ నిధులతో వాటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆస్పత్రి పాత భవనం స్లాబ్ పెచ్చులు ఊడుతున్నాయని మరమ్మతులకు నిధుల కేటాయింపు కోసం కృషి చేస్తానన్నారు. ఖమ్మం ఆస్పత్రికి ఎంతో పేరు ఉందని.. గతంలో మహబూబాబాద్, తదితర దూర ప్రాంతాల నుంచి కూడా రోగులు వచ్చే వారని తెలిపారు. వైద్య చికిత్స పై ఫిర్యాదులు అందుతున్నాయని, ఎలాంటి జాప్యం లేకుండా మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్ కుమార్, డాక్టర్ బాబు రత్నాకర్ డాక్టర్, ఆర్ఎంవో డాక్టర్ వినాయక్‌రాథోడ్, బి కిరణ్ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం..

(5వ పేజీ తరువాయి)

స్కూల్స్ నిర్మాణానికి ఒకే సారి 11వేల 600 వందల కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని అన్నారు. చదువుకుని గ్రామాల్లో ఖాళీగా ఉన్న యువత కోసమే జాబ్ మేళా ఏర్పాటు చేసామని, ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు పొందిన వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నుండి వంద కంపెనీలను జాబ్‌మేళాకు రప్పించటం జరిగిందని మరికొన్ని నెలల్లో మరోసారి జాబ్ మేళా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కాగా, ఈ జాబ్ మేళాలో 5287 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, దాదాపు వంద కంపెనీలు 2235 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందచేసాయి. కనిష్టంగా నెలకు రూ.12 వేల వేతనం తో ప్రారంభం కాగా, గరిష్టంగా రూ.40వేలు వేతనం గల ఉద్యోగాలు దక్కాయి. మధిర పట్టణంకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని సముద్రాల ప్రియాంక సంవత్సరానికి రూ.4 లక్షల వేతనంతో తొలి నియామకాన్ని భట్టి చేతుల మీదుగా అందుకోగా దాచాపురానికి చెందిన విద్యార్థి వేల్పుల శివ నెలకు 40వేల వేతనంతో అత్యధిక వేతనంతో ఉద్యోగం పొందాడు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ శ్రీజ, సింగరేణి జీఎం మెరుగు షాలెం రాజు, తహసీల్దార్ రాంబాబు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ట్రెయినీ ఐపిఎస్ రుత్విక్‌సాయి, సి.ఐ. మధు పలువురు అధికారులు, కంపెనీల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్టేషనరీ, ప్రింటింగ్, ఎలక్ట్రికల్ సామగ్రి సరఫరాకు టెండర్లు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రెండు సంవత్సరాల కాల పరిమితిలో జనరల్ స్టేషనరీ, ప్రింటింగ్, ఎలక్ట్రికల్ వస్తువులను సరఫరా చేసేందుకు అర్హత ఉన్న ఏజెన్సీలు టెండర్లను మే 9వ తేదీ లోగా దాఖలు చేయాలని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 2 లోగా కార్యాలయ పనివేళల్లో రూ.5 వేల డిమాండ్ డ్రాఫ్ట్/బ్యాంకు చెక్ మెడికల్ సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఖమ్మం పేరున తీసి టెండర్ ఫారాలను పొందాలని, తిరిగి మే9 లోగా టెండర్లు సమర్పించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

పనికిరాని ఇనుప సామగ్రి వేలం

ఖమ్మం క్రైం, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): పనికిరాని ఇనుప సామగ్రిని ప్రజల సమక్షంలో బహిరంగ వేలం వేస్తున్నట్టు జిల్లా జైలు సూపరింటెండెంట్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జైలులోని ఫ్యాక్టరీ స్క్రాప్‌ను ఈనెల 25న వేలం వేయనున్నామని, ఆసక్తిగలవారు రూ.5వేలు కనీస దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలం సామగ్రిని పాడిన వా వారు 18శాతం జీఎస్టీతోపాటు మొత్తం సొమ్మును వెంటనే చెల్లించి తీసుకెళ్లాలని, ఇతర వివరాలకు జిల్లా జైలర్లు సక్రునాయక్ (94946 32552), లక్ష్మీనారాయణ(97005 05151)ను సంప్రదించాలని ఆయన కోరారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు చర్విత



చర్వితను అభినందిస్తున్న హార్వెస్ట్ స్కూల్ కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో ఈనెల 25 నుంచి 29 వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు తమ పాఠశాల ఎం. చర్విత ఎంపికైందని నగరంలోని హార్వెస్ట్ పాఠశాల యజమాన్యం తెలిపింది. చర్విత గత మార్చిలో వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలలో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి అభినందించారు. జాతీయ పోటీల్లో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆర్‌పీల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, ఉన్నత పాఠశాలల స్థాయిలో మండల, జిల్లా స్థాయిలో రిసోర్స్ పర్సన్స్(ఆర్‌పీ)గా పనిచేయుటకు ఆసక్తి గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీలోపు డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక కమిటీ రిసోర్స్ పర్సన్లను ఎంపిక చేస్తుందని తెలిపారు.

వేసవిలో ఉపాధ్యాయులకు శిక్షణ

రిసోర్స్ పర్సన్ల ఎంపిక తర్వాత మే నెలలో ఆ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామని డీఈవో తెలిపారు. ఈ నెల 30 వరకు మండల, జిల్లా పరిధిలో రిసోర్స్ పర్సన్ల ప్రక్రియ పూర్తి చేసి ఎస్సీఈఆర్‌టీకి జాబితా పంపాలని విద్యాశాఖ ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

మధిరరూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మధిర మండలం నిదానపురంలో సోమవారం వడదెబ్బతో ఒకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన మేసిపోగు రత్తయ్య(33) మేకలు మేపేందుకు పొలానికి వెళ్లి ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురై పొలం వద్దనే కుప్పకూలిపోయాడు. అక్కడ ఉన్నవారు రత్తయ్య కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు అతడిని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. మృతుడి కి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు. రత్తయ్య భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధిర రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరు...

నేలకొండపల్లి, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. ఆదివారం బోదులబండ అండర్‌పాస్ వద్ద లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో హరికరణ్ అనే వ్యక్తి మృతి చెందగా, రాంజీలాల్‌బహదూర్(30), బహదూర్‌లు తీవ్రంగా గాయపడిన సంగతి పాఠకులకు తెలిసిందే. తీవ్రంగా గాయపడిన వారిని ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తున్న నేపథ్యంలో రాంజీలాల్ బహదూర్ అనే వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తి బహదూర్ కోలుకుంటున్నట్లు పోలీసువర్గాలు తెలిపాయి.మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. మృతులు రాజస్థాన్‌కు చెందిన వారు. క్వారీ పనులు చేయటానికి రాజస్థాన్ నుంచి వచ్చినట్లు తెలుస్తున్నది. ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో...

తిరుమలాయపాలెం, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో జరిగింది. కుక్కలతండాకు చెందిన గుగులోత్ కిషన్(32) సోమవారం పొలంలో వరిగడ్డిని కట్టలు కడుతుండగా పాము కాటేసింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన అతడిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుని బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వాహనదారుడు..

బూర్గంపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీపురంలో సోమవారం చోటు చేసుకుంది. భద్రాచలానికి చెందిన పసుపుతోట నాగేశ్వరరావు(65) లక్ష్మీపురంలోని ఓ మిల్లులో పని చేస్తున్నాడు. సోమవారం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, లక్ష్మీపురంలోని పెట్రోలు బంకు సమీపంలో పాల్వంచ వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒకరికి గాయాలు

తిరుమలాయపాలెం, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో లైన్ ఇన్‌స్పెక్టర్ గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గోపాలపురానికి చెందిన లైన్ ఇన్‌స్పెక్టర్ రాములు తిరుమలాయపాలెం, పిండిప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఎల్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో విద్యుత్ సరఫరాలో ఏర్పడింది. ఈసమయంలో వాహనంపై రోడ్డుకు చేరుకోగా ఈక్రమంలో మరిపెడ బంగ్లా నుంచి ఖమ్మం వెళుతున్న లారీ వచ్చి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలు కావడంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

భద్రాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సోమవారం ఖమ్మం ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు నిర్వహించిన దాడుల్లో ద్విచక్ర వాహనంపై ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 11.150 కేజీల ఎండు గంజాయి, ద్వి చక్ర వాహనం, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రం దాముహంటల్‌కు చెందిన భీమా, గుట్ట అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. అలాగే నాటుసారాయి తనిఖీల్లో భాగంగా కొర్రాజులగుట్ట పరిసరాలు, పర్ణశాల, చిన్ననల్లబెల్లి గ్రామాల్లో దాడులు నిర్వహించి 22 లీటర్లనాటుసారాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

టీజీఆర్ సెట్ సీట్ల భర్తీలో గందరగోళం

- స్థానికతకు ప్రాధాన్యం ఇవ్వని ప్రభుత్వం
- 5వ తరగతి విద్యార్థులకు సుదూర ప్రాంతా ల గురుకులాల్లో సీట్లు
- వందల కిలోమీటర్లు ప్రయాణించి ఏన్కూరు గురుకులానికి వచ్చిన విద్యార్థులు



ఏన్కూరు, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): గురుకుల ఐదో తరగతి (టీజీఆర్ సెట్-25) సీట్ల భర్తీలో గందరగోళం నెలకొంది. రాష్ట్రంలో ఎక్కడపడితే అక్కడ సీట్లు విసిరేసినట్టు కేటాయించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని జ్యోతిబా పూలే, మైనారిటీ టీఆర్ఈఐ జనరల్, గిరిజన సంక్షేమశాఖ గురుకులాల్లోని ఐదోతరగతి సీట్ల భర్తీకి సాంఘిక సంక్షేమశాఖ ఉమ్మడి ఎంట్రన్స్ టెస్టును నిర్వహించి ఏప్రిల్ 3వతేదీన మెరిట్ లిస్టు, 5వతేదీన స్కూల్స్ ఎలాట్‌మెంట్, 10వతేదీన ఫైనల్ లిస్టు వెబ్‌సైట్‌లో ఉంచారు. రాష్ట్రవ్యాప్తంగా 1,34,478 మంది పరీక్షకు హాజరుకాగా వీరిలో 79,810 మంది విద్యార్థులు అర్హత సాధించారు. తాజాగా వెబ్‌సైట్‌లో ఈనెల10 నుంచి 20తేదీలోపు పాఠశాలలో అడ్మిషన్లు పొందాలని, పొందుపరిచిన జాబితా తప్పులు తడకగా ఉంది. జిల్లా, నియోజక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వక వేరే జిల్లా విద్యార్థులను ఇక్కడకు, ఈజిల్లా విద్యార్థులను వేరే జిల్లాకు కేటాయించడం పట్ల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఉదాహరణకు యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం గ్రామానికి చెందిన వై.జగదీష్, నిర్మల్‌జిల్లా సారంగాపూర్ గ్రామానికి చెందిన బి.సాత్విక్, హుజూర్‌నగర్‌కు చెందిన బి.యశ్వంత్, కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఖర్జవెల్లికి చెందిన కె.సాయి దీక్షితులకు ఏన్కూరు గురుకుల పాఠశాలకు కేటాయించడంతో సుదూర ప్రాంతాల నుంచి అడ్మిషన్లు పొందారు. రాకపోకలకు ప్రయాణ ఖర్చుల దృష్ట్యా ఏ జిల్లా విద్యార్థులను ఆ జిల్లాకే కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రయాణ ఖర్చు రూ.3వేలు అయింది

కిరిమరి సంతోష్, టోన్‌కిని, ఆసిఫాబాద్ జిల్లా



మా బాబు భవిక్‌కు ఏన్కూరు గురుకుల పాఠశాలలో సీటు వచ్చింది. బోన్‌కిని ఆసిఫాబాద్‌జిల్లా 430 కి.మీ. దూరం ఇబ్బంది పడుతూ ప్రయాణం చేశాం. ప్రయాణఖర్చు రానుపోను రూ.3వేలు అయింది. ఐదో తరగతి విద్యార్థి ఇంత దూరంలో ఎలా ఉంటాడు. రావడం పోవడానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. స్థానిక ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీచేయాలని వేడకుంటున్నా.

సీఎం సమక్షంలోనే పెళ్లి చేసుకుంటా..

కారేపల్లి, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వివాహం చేసుకోవాలని ఉందని, అందుకు సీఎం సార్ ఎప్పుడు సమయం ఇస్తే అప్పుడే వివాహం చేసుకుంటా అని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో తన మనసులో మాట తెలిపాడో యువకుడు. కారేపల్లి మండల పరిధిలోని మేకల తండాకు చెందిన భూక్య గణేష్‌కు మహబూబాబాద్ జిల్లా వెంకట్రాప్ తండాకు చెందిన కవితతో మార్చి6 నిశ్చితార్థం జరిగింది. కాగా ఆదివారం మేకలతండాకు వచ్చిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను కలిసి తన పెళ్లికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తీసుకరావాలని, ఆయన ఎప్పుడు సమయం ఇస్తే ఆరోజేవివాహం చేసుకుంటానని, ఇందుకు ఎమ్మెల్యేగా సహకరించాలని గణేష్ కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సీఎంను తీసుకువచ్చేందుకు తన వంతుగా కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈవిషయంపై గణేష్ మాట్లాడుతూ సీఎం వస్తేనే వివాహం చేసుకుంటానని తెలిపారు.

నా రాజకీయ నిర్ణయం సరైనదే..



సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు
- సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం

దుమ్ముగూడెం ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం తాను తీసుకున్న రాజకీయ నిర్ణయం సరైనదేనని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. పెదనల్లబల్లిలో సోమవారం సన్నబియ్యం లబ్ధిదారుడు మట్టా శేఖర్ ఇంట్లో భోజనం చేశారు. అనంతరం మాజీ సర్పంచ్ మట్టా శివాజీ ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం పదేళ్లలో నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదని, భద్రాచలం అభివృద్ధికి రూ.వంద, వెయ్యి కోట్ల నిధులిస్తామనే ప్రకటనలకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రైతులకు రూ2లక్షల రుణమాఫీ, సబ్సిడీపై గ్యాస్ పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, పేదలకు సన్నబియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ వంటి పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వాల అసమగ్ర విధానాలతో తనకు వారసత్వంగా సంక్రమించిన భూములను కూడా నమోదు చేయించుకోలేక పోయానని, ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్‌తో భూముల రిజిస్ట్రేషన్ సులభతరమౌతుందన్నారు. భద్రాచలం మాడవీధి అభివృద్ధికి తొలి విడతగా రూ.34 కోట్లను మంజూరు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. భద్రాచలం కరకట్ట అభివృద్ధి పనులు, మండలంలో సీసీ, గ్రావెల్ రహదారులు, భగీరథ అభివృద్ధి పనులకు రూ.కోట్లాది నిధులను తెచ్చామన్నారు. ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకం ఆధునీకరణ పనులకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. త్వరలోనే మండలంలో పలు అంతర్గత బీటీ రహదారులు, తూరుబాక వద్ద శిథిలావస్థకు చేరిన కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభమౌతాయన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో 46 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులనందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, గిర్దావర్లు గుండిరాజులు, కల్లూరి వెంకటేశ్వర్లు, నర్సింహారావు, మార్కెటు కమిటీ చైర్మన్ సీతమ్మ, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అన్నె సత్యనారాయణమూర్తి, కుంజా శ్రీనివాసరావు, ముర్రం వీరభద్రం, తెల్లం హరికృష్ణ, కెల్లా శేఖర్, గడ్డం బాలాజీ, మోతుకూరి శ్రీకాంత్, అయ్యప్పరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.

హవ్వ.. గర్భగుడిలో ఫొటోలా..

- రామాలయంలో బీఆర్ఎస్ నాయకుల హల్‌చల్
- గర్భగుడిలో ఫొటో తీసిన ఓ ప్రజాప్రతినిధి ఫొటోగ్రాఫర్
- ఎస్‌పీఎఫ్ సిబ్బంది వారిస్తున్నా సెల్‌ఫోన్లతో ఆలయంలోకి..

భద్రాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఎమ్మెల్సీ కవిత పర్యటనలో భాగంగా సోమవారం రామాలయాన్ని దర్శించారు. ఈ సమయంలో ప్రధాన ఆలయంలో పూజలు నిర్వహించేందుకు ఎమ్మెల్సీలు కవిత, తాతా మధు, రాజ్యసభ ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు వెళ్లారు. ఈ సమయంలో ఓ కీలక ప్రజాప్రతినిధి ఫొటోగ్రాఫర్ గర్భగుడిలో ఫొటోలు తీసినట్లు విశ్వసనీయ సమాచారం. దీన్ని గమనించిన రామాలయ ఎస్‌పీఎఫ్ సిబ్బంది వెంటనే స్పందించి సదరు ఫొటోగ్రాఫర్ నుంచి కెమెరా గుంజుకొని ఆ ఫొటోలను కెమెరాలో నుంచి తొలగించారు. అంతకు ముందు ప్రధాన ఆలయంలో ప్రవేశించే సమయంలో సైతం ఎస్‌పీఎఫ్ సిబ్బంది వారిస్తున్నా సెల్‌ఫోన్లతో బీఆర్ఎస్ నాయకులు ఆలయంలోకి ప్రవేశించారు. ఈ క్రమంలో ఎస్‌పీఎఫ్ సిబ్బంది వారించినా వినలేదని సమాచారం.



ఎస్‌పీఎఫ్ సిబ్బంది వారిస్తున్నా సెల్‌ఫోన్లతో వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న నాయకులు

385 మంది రైతులు..రూ.1.45కోట్లు

- యాసంగిలో ఇప్పటి వరకు చెల్లించిన బోనస్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 385 మంది రైతులకు రూ.కోటి 45లక్షల28వేలను చెల్లించినట్లు తెలిపారు. 29,056 క్వింటాళ్ల సన్నధాన్యానికి రైతులకు బోనస్ చెల్లించినట్లు ఆయన తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌ను పొందాలని ఆయన కోరారు. తల్లాడలో 134మంది రైతుల నుంచి 12వేల క్వింటాళ్లకు రూ.60లక్షల400లు చెల్లించామన్నారు. కల్లూరు మండలం లో 74 మంది రైతులకు 6,456 క్వింటాళ్లకు గాను రూ.32 లక్షల 28వేలు, నేలకొండపల్లి మండలంలో 116 మంది రైతులకు 6016 క్వింటాళ్లకు గాను రూ.30లక్షల 8వేలు, కూసుమంచి మండలంలో 61 మందికి 4,583 క్వింటాళ్లకు గాను రూ.22లక్షల 91,600లు బోనస్‌గా చెల్లించినట్లు డీఎస్వో తెలిపారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

మణుగూరు/అశ్వాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో భూమి సమస్యలు పరిష్కారం అవుతాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారంమణుగూరు పట్టణంతో పాటు అశ్వాపురంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటే శ్వర్లుతో కలిసి మాట్లాడారు. భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడం వల్ల రైతులకు భూములపై హక్కు భద్రత లభిస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాటి ప్రభుత్వ ధరణి వల్ల రైతులు ఎంతో ఇబ్బందులు పడ్డారని, వారి సమస్యలు పరిష్కారం కాక ఆవేదనతో ఉండే వారన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటూ సమస్యల పరిష్కారించేందుకు వీలుగా ఉంటుందన్నారు. చట్టంపై రైతులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. సాదాబైనామాలకు కూడా ఈచట్టం ద్వారా క్రమబద్ధీకరణకు అవకాశం ఉందన్నారు. రైతులకు సంబంధించిన అంగుళాభూమికి కూడా భూధార్ నెంబర్ కెటాయించడం జరుగుతుందన్నారు. రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లతో పాటు సంబంధిత భూమి మ్యాప్‌ను కూడా బుక్‌లో పొందుపర్చటం జరుగుతుందని తెలిపారు. భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. అనంతరం రైతులనుంచి వినతిపత్రాలను స్వీకరించి, వారి సమస్యలను అడిగితెలుసుకుని సమాధానం ఇచ్చారు. అనంతరం సీపీఐ నేత బీ అయోధ్య, సీపీఎం నాయకులు సత్రపల్లి సాంబశివరావు లు జిల్లా కలెక్టర్‌కు సమస్యలను విన్నవించారు. అనంతరం రైతులనుంచి వినతిపత్రాలను స్వీకరించి,వారిసమస్యలను అడిగితెలుసుకుని సమాధానం ఇచ్చారు. ఆయా కార్యక్రమాలలో ఆర్డీవో దామోదర్ రావు, తహసీల్దార్ రాఘవరెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు తాతారావు, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో వరప్రసాద్, ఆర్ఐ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారులను విస్మరిస్తున్న నాటి నేటి ప్రభుత్వాలు'

భద్రాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ ఉద్యమకారులుగా మేమెంతో పోరాటం చేశాం....లాఠీలతో దెబ్బలుతిన్నాం....బాధలుపడ్డాం....కేసీఆర్ కలలుగన్న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది అయితే గత దశాబ్దకాలంగా ఉద్యమకారులను నాటి నేటి ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఉద్యమకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించగా ఇందులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన పలువురు ఉద్యమకారులు తమ ఆవేదనను కవిత ముందు వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో సర్వస్వం కోల్పోయిన తమకు సరైన గుర్తింపు లభించడం లేదని భద్రాచలంకు చెందిన నూకపేయి రాజేంద్ర వర్ధన్ ఆరోపించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులుగా ఉన్న నాయకునికి భద్రాచలంలో తెలంగాణ ఉద్యమకారులు ఎవరో తెలియదా అంటూ ప్రశ్నించారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, పువ్వాడ అజయ్‌కుమార్‌లు తమ అనుచరులకే ప్రాధాన్యమిస్తూ వచ్చారని వాపోయారు. ఇదిలా ఉండగా సీనియర్ ఉద్యమకారులు దిండిగాల రాజేందర్, రామ్మూర్తి, సతీష్ తదితరులు మాట్లాడుతూ ఉద్యమకారులకు సరైన న్యాయం ఇప్పటి వరకు జరగలేదని వారు సైతం ఆవేదన చెందారు. ఈ క్రమంలో తన ప్రసంగంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ఉద్యమకారులకు కొంత అన్యాయం జరిగిన మాట వాస్తవమేనని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వ పాలన సాగిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

- రూ.1.50లక్షల నష్టం

నేలకొండపల్లి, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి దాదాపుగా రూ.1.50 లక్షలు నష్టం జరిగిన సంఘటన సోమవారం నేలకొండపల్లిలో జరిగింది. నేలకొండపల్లి పాత జగన్నాథ టాకీస్ వెనుక బజార్‌లో ఉన్న చింతకాయల సురేష్ ఇంట్లో హీటర్‌ను ఆన్‌చేసి, ఆఫ్ చేయటం మర్చిపోయి కుటుంబ సమేతంగా ఫంక్షన్‌కు బయటి ఊరు వెళ్లారు. హీటర్ ఆన్‌లో ఉండటంతో షార్టు సర్క్యూట్ అయ్యి పక్కనే ఉన్న వాషింగ్ మెషీన్‌కు మంటలు అంటుకున్నాయి. కొద్దికొద్దిగా మంటలు మొత్తం వ్యాపించి ఇంటి వైరింగ్‌తో సహా తలుపులు, కిటికీలు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

అటవీ ఉత్పత్తుల సేకరణతో ఆదాయం

- వేసవిలో గిరిజనులకు ఉపాధి
- త్వరలో తునికాకు సేకరణ ప్రారంభం



అశ్వాపురం ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అటవీ ఉత్పత్తుల సేకరణతో వేసవిలో గిరిజనులకు ఉపాధిలభించనుంది. సేకరించిన ఉత్పత్తుల విక్రయాల ద్వారా ఆదాయం పొందనున్నారు. అశ్వాపురం అటవీరేంజ్ పరిధిలో మేనెల ప్రారంభం నుంచి తునికాకు సేకరణ ప్రారంభం కానుండటంతో సేకరణకు గిరిజన, గిరిజనేతరులు సమాయత్తమవుతున్నారు. మణుగూరు సబ్‌డివిజన్ పరిధిలో 5,400 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరణ లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి టెండర్లు పూర్తయినా, ఒప్పందాలు పూర్తికాలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తునికాకు చిగురిస్తోంది. దీంతో నాణ్యమైన తునికాకు సేకరణ జరుగనుంది. మణుగూరు సబ్ డివిజన్ పరిధిలోని బూర్గంపాడు, బయ్యారం, కరగూడెం, మణుగూరు యూనిట్లలో తునికాకు సేకరించనున్నారు.

అధికారుల ముందుచూపుతో గిరిజనులకు సీజన్‌లో అటవీఫలాలు దక్కుతున్నాయి. ముఖ్యంగా రేంజ్ పరిధిలోని ఇరవెండి సెక్షన్‌తో పాటు తుమ్మలచెరువు బీట్‌లో అధికారులు 36 హెక్టార్ల పరిధిలో అటవీ అభివృద్ధి పథకంలో భాగంగా ప్లాంటేషన్ పెంపకం చేపట్టగా, దానిలో పలు పండ్ల చెట్లను పెంచారు. ఇప్ప, అడవి ఈత, కరక్కాయలు, తునికి, మారేడుపండ్ల మొక్కలను నాటటంతో అవిఫలాలను ఇస్తున్నాయి. గిరిజనులు ఇక్కడ సేకరించిన ఫలాలను గిరిజనసహకార సంఘం, ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించుకోవడం ద్వారా ఆదాయం పొందుతున్నారు. మొత్తం మీద అటవీఫలాలు, తునికాకు సేకరణతో గిరిజనులు వేసవిలో రెండో ఆదాయం పొందనున్నారు.

వేసవి శిక్షణకు వేళాయే

- మే 1 నుంచి 31 వరకు ప్రత్యేక క్రీడా శిక్షణ
- రూరల్‌లో 21, అర్బన్‌లో 23 కేంద్రాల ఏర్పాటు



ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు జిల్లాలోని రూరల్ ప్రాంతంలో 21 కేంద్రాలు, అర్బన్ ఏరియాలో 23 కేంద్రాలలో వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు నోటిఫై చేశారు. కాగా ఆయా శిబిరాల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులను సైతం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా శిబిరాల వివరాలను డీవైఎస్వో సునీల్‌రెడ్డి ప్రకటించారు. నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో పలు ఆటలలో తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతే కాకుండా జిల్లాలోని కల్లూరు, వైరా ఇండోర్ స్టేడియం, మధిర, బోనకల్, వీవీ పాలెం, కూసుమంచి మండలంలో, పాండురంగాపురంతో పాటు మరికొన్ని కొత్త ప్రాంతాలలో సైతం వేసవి శిక్షణలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆయా క్రీడాంశాలకు కేటాయించిన కోచ్‌ల సమాచారం కోసం సర్దార్ పటేల్ స్టేడియంలోని క్రీడల కార్యాలయంలో నేరుగా కాని 9618718929 నెంబరు ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

వేసవి శిబిరాలను సద్వినియోగించుకోండి: డీవైఎస్వో సునీల్‌రెడ్డి

విద్యార్థులు పాఠశాల సెలవులను వృథా చేసుకోకుండా ఈ వేసవి శిబిరాలను సద్వినియోగించుకోవాలి. తల్లిదండ్రులు వేసవి సెలవులలో తమ పిల్లలను క్రీడా శిబిరాలలో చేర్పించేందుకు ముందుకురావాలి. విద్యార్థులు వేసవి సెలవుల్లో ఖచ్చితంగా ఏదో ఒక క్రీడాంశాన్ని నేర్చుకోవాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ వేసవి శిబిరాలకు అర్హులే.

జిల్లా కోర్టు ముఖ్యపరిపాలన అధికారి బదిలీ

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాకోర్టు ముఖ్య పరిపాలనాధికారిగా పనిచేస్తున్న పి.హరికృష్ణ సికింద్రాబాద్ ప్రత్యేక ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ కోర్టులో పనిచేస్తున్న సంజయ్ షెట్కర్ ఖమ్మం కోర్టుకు నూతన ముఖ్య పరిపాలనాధికారిగా రానున్నారు. ఖమ్మం కోర్టులో పనిచేస్తున్న బి.మల్లికార్జునరావు ఐదో అదనపు జిల్లా కోర్టు బోధన్‌కు ముఖ్య పరిపాలనాధికారిగా బదిలీ అయ్యారు. ఖమ్మం కుటుంబ న్యాయస్థానం ముఖ్య పరిపాలనాధికారిగా పి.గోపాకృష్ణ రానున్నారు. గోపాలకృష్ణ రంగారెడ్డి జిల్లా ప్రధాన కోర్టులో పనిచేస్తూ ఖమ్మానికి బదిలీ అయ్యారు.

సైబర్‌క్రైం కేసులో నిందితుడి అరెస్ట్

ఖమ్మం క్రైం, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): ఓ సైబర్‌క్రైం కేసులో నిందితుడుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్టు సైబర్‌క్రైం డీఎస్పీ సీహెచ్‌ఆర్‌వీ ఫణీధర్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని రామంతపూర్‌కు చెందిన ఎంకే తమిళగన్ అనే వ్యక్తి ఖమ్మానికి చెందిన ఓ యువకుడికి ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానని, నగదు వెచ్చిస్తే డబ్బులు వస్తాయని మాయమాటలు చెప్పాడు. దీంతో ఆ వ్యక్తి గత ఏడాది డిసెంబర్‌లో దశల వారిగా రూ.9,25,575 నగదు తమిళగన్ బ్యాంక్ అకౌంట్‌కి పంపాడు. కొద్ది రోజుల తర్వాత తాను మోసపోయానని గుర్తించి సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ జరిపిన పోలీసులు తమిళగన్‌గా గుర్తించి సోమవారం అతడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు.

అక్రమంగా మట్టితోలారని ఫిర్యాదు

ఖమ్మం క్రైం, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): తమ ఖాళీ స్థలంలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మట్టి పోయించడంతో ఓబాధితురాలు సోమవారం ఖానాపురం హవేలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోనకల్ మండలం ముష్టికుంట గ్రామానికి చెందిన ప్రజావాణి అనే మహిళ 2012లో నగరంలోని ముస్తఫానగర్ రోడ్డు నెం.10లో ఓ ప్లాట్‌ను కొనుగోలు చేశారు. ఆప్లాట్ తమదని నగరానికి చెందిన కొత్తా సీతారాములు, సత్యాల వెంకయ్య మట్టిని తోలించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో 6 నెలలు జైలు

ఖమ్మం లీగల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లోని కూకట్‌పల్లి కి చెందిన కాజ వాణికి చెల్లని చెక్కు కేసులో 6నెలలు జైలుశిక్ష తోపాటు ఫిర్యాదికి రూ. 30లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం మద్యపాన ఆబ్కారి ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత సోమవారం తీర్పుచెప్పారు. రఘునాథపాలెం మండలం బాలపేటకు చెందిన వడ్లమూడి నాగేశ్వరరావు దాఖలు చేసిన ప్రైవేటు కేసులో ఈ తీర్పు వెలువడింది.

మహబూబ్‌నగర్ పట్టణానికి కుమ్మరి శేకర్ కి చెల్లని చెక్కు కేసులో 6నెలలు జైలుశిక్ష తోపాటు ఫిర్యాదికి రూ. 7లక్షల చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప సోమవారం తీర్పుచెప్పారు. ముదిగొండ మండలం గోకినపల్లికి చెందిన వరకల వెంకటేశ్వరరావు తన బాకీ వసూలు కోసం న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలుచేసినారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

విభాగాల్లో అంతర్గత పోరు

- గందరగోళంగా కేఎంసీ
- వివాదాలతో విడిపోయిన ఎస్టాబ్లిష్‌మెంట్
- జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు ప్రత్యేక గదులు
- మేనేజరు చాంబర్ వదలని ఆర్వో



మెప్మా పీడీ చాంబర్‌లోకి వెళ్లిన సీ2 విభాగం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఉద్యోగులు అంతర్గత పోరుతో రగిలిపోతున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. ఉద్యోగుల వేతనాల నుంచి సర్వీస్, కోర్టు కేసులు వరకు కీలకమైన విషయాల వరకు పారదర్శకంగా పర్యవేక్షణ చేయాల్సిన ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం రెండు విభాగాలుగా విడిపోయింది. సూపరింటెండెంట్ కేడర్ పర్యవేక్షణ చేయాల్సిన విభాగాలను జూనియర్ అసిస్టెంట్‌ల చేతిలో పెట్టటమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ఇక కార్యాలయంలో ఏ చాంబర్ ఖాళీ అయితే ఆ చాంబర్‌లోకి అధికారులు వెళ్లటం, తర్వాత వచ్చిన అధికారులకు కుర్చీ కూడా లేక పోవటం పెద్ద సమస్యగా మారింది.

విడిపోయిన ఎస్టాబ్లిష్‌మెంట్

ఖమ్మం నగర పాలక సంస్థలో సీ1, సీ2 విభాగాలు కలిపి ఎస్టాబ్లిష్‌మెంట్ ఒకే విభాగంగా ఇప్పటి వరకు పనిచేసింది. గతంలో సీనియర్ అసిస్టెంట్, ఆ పైస్థాయిలో హోదా కలిగిన వారు ఎస్టాబ్లిష్‌మెంట్ పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టారు. అయితే గత కొన్ని నెలలుగా సీ1 విభాగాన్ని జూనియర్ అసిస్టెంట్ పర్యవేక్షణ చేస్తున్నారు. సీ2 లోను కొత్తగూడెం జిల్లా నుంచి వచ్చిన మరో జూనియర్ అసిస్టెంట్ పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ క్రమంలో సీ2లో తీసుకునే నిర్ణయాలు, సీ1 విభాగం నుంచి బయటకు వెళ్తున్నాయని కొంతకాలంగా అంతర్గతంగా వివాదాలు జరిగాయి. ఈ క్రమంలో ఒకే ఎస్టాబ్లిష్‌మెంట్‌లో రెండు వర్గాలుగా ఉద్యోగులు విడిపోయారు. ఇద్దరు కూడా జూనియర్ అసిస్టెంట్ కేడర్ అయినా వారి వెనుకు ఉన్న అధికారుల ప్రోత్సాహంతో ఇరువురు సోమవారం రెండు చాంబర్లను ఏర్పాటు చేసుకున్నారు. సీనియర్ అసిస్టెంట్‌కు పైస్థాయిలోని బాధ్యతలు జూనియర్ అసిస్టెంట్‌లు నిర్వహించటం, వారికి వేర్వేరుగా చాంబర్లు కేటాయించటం వివాదాస్పదంగా మారింది.

మేనేజరు చాంబర్ వదలని ఆర్వో

కేఎంసీలో రెండో ఫ్లోర్‌లో మేనేజరు కోసం ప్రత్యేకంగా చాంబర్‌ను కేటాయించారు. అయితే ఇటీవల కేఎంసీ మేనేజరు డోర్నకల్‌కు బదిలీ కావటంతో వెను వెంటనే ఆ చాంబర్‌లోకి ఆర్వో శ్రీనివాసరావు వెళ్లి అక్కడ నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా గత శనివారం కేఎంసీ మేనేజరుగా నల్గొండ జిల్లా నుంచి వచ్చిన బుచ్చిబాబు బాధ్యతలు స్వీకరించారు. కానీ కేఎంసీ అధికారులు బచ్చిబాబుకు కుర్చీ చూపలేదు.



మెనేజరు చాంబర్‌లో ఆర్వో కార్యాలయం

జనన, మరణాల విభాగంలో చూసుకోవాలని తెలిపారు. అయితే ఆ విభాగంలో ఇప్పటికే ఏఎస్వో స్థాయి అధికారి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గ్రేడ్-2 మునిసిపాలిటీలో పనిచేసి వచ్చిన మేనేజర్ స్థాయిలోని ఉద్యోగిని జనన, మరణాల విభాగానికి కేటాయించటం మరో వివాదానికి కారణమైంది.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మూడు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల ఖమ్మం రైల్వే పోలీసుల పరిధిలో గుర్తు తెలియని వృద్ధుడు(60) రైలు ప్రమాదంలో మృతి చెందాడు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం పోలీసుల పరిధిలో మేడేపల్లి గ్రామ సమీపాన వ్యవసాయ బావిలో గుర్తు తెలియని యువకుడు(30) మృతదేహం లభ్యం కాగా, అన్నం ఫౌండేషన్‌లో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ మూడు మృతదేహాల కోసం ఎవరూ రానందున వాటిని అనాథ మృతదేహాలుగా గుర్తించి పోలీసులు, అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

కుటుంబానికి ఆర్థికసాయం

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన పి. నాగేంద్రబాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబానికి శ్రీలక్ష్మితిరుపతమ్మతల్లి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం రూ.8900లు నగదు అందించారు. ఈకార్యక్రమంలో గోకినపల్లిబోస్, గణేష్, వంశీ, శేఖర్ పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల నిరసన

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం అధ్యాపకుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నగరంలోని పీజీ కళాశాలలో కళాశాల పార్ట్‌టైం అధ్యాపకులు చాక్‌పీస్ డౌన్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చేకురి రవికుమార్, రవిబాబు, వీరన్న, రాణి, హరిత పాల్గొన్నారు.

ఖమ్మం- దేవరపల్లి హైవే పనుల పరిశీలన



హైవే పనులను పరిశీలిస్తున్న ఎంపీ రఘురాం రెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం- దేవరపల్లి నేషనల్ హైవే నిర్మాణ పనుల పురోగతిని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం పరిశీలించారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ బ్రిడ్జి వద్ద నుంచి కోదాడ మార్గంలో, ధంసలాపురం వరకు ఎన్‌హెచ్‌ఏఐ పీడీ దివ్యతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి మేరకు డిల్లీ వెళ్లి కేంద్ర మంత్రిని కలిసి ధంసలాపురం వద్ద సర్వీస్ రోడ్ మంజూరు చేయించగలిగామన్నారు. వీలైనంత త్వరగా దేవరపల్లి హైవే నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత అగ్రహారం రైల్వే బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికులు పలు సమస్యలను వివరించగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ భైరు హరినాధబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, బ్రహ్మ రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌తో ఖమ్మం బిషప్‌కు అనుబంధం

- వాటికన్‌లో పోప్‌ను కలిసిన సగిలి ప్రకాష్



పోప్ ఫ్రాన్సిస్‌తో ఖమ్మం బిషప్ ప్రకాష్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): క్యాథలిక్‌ల జగద్గురువు పోప్ ఫ్రాన్సిస్‌తో ఖమ్మం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్‌కు ఆత్మీయ అనుబంధం ఉన్నది. పోప్ ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం వాటికన్ సిటీలో దివంగతులయ్యారు. గతంలో ఖమ్మం బిషప్ సగిలి ప్రకాష్ రోమ్ నగరంలోని వాటికన్ సిటికి వెళ్లి పోప్ ఫ్రాన్సిస్‌ను కలిశారు. పోప్ ఫ్రాన్సిస్‌కు ఖమ్మం నేత్రాసనం విశిష్టతను గురించి వివరించారు. ప్రకాష్‌ను ఖమ్మం పీఠానికి బిషప్‌గా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమయంలో పోప్‌ను శాలువతో ఘనంగా సన్మానించి, కరుణగిరి పుణ్యక్షేత్రం ఫొటోను బహూకరించారు. ఈ విషయాలను బిషప్ ప్రకాష్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఈ సందర్భంగా పలు విషయాలను తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ ఎల్లప్పుడు సర్వ మానవాళి క్షేమం కోసం తపించేవారని, కారాగారాలలో ఉన్న ఖైదీల పట్ల అప్యాయతను చాటారన్నారు. ఫ్రాన్సిస్ పోప్ మరణం ప్రపంచానికి తీరని లోటని, ఆయన సంకల్పాన్ని అందరం పటిష్ఠతతో కార్యరూపం ద్వారా ఆచరించాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.



గోశాలకు ట్రాక్టర్‌లో వరిగడ్డి తీసుకొస్తున్న దృశ్యం

ఓం శ్రీకృష్ణ గోశాలకు వరిగడ్డి వితరణ

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓం శ్రీకృష్ణ గోశాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో 20 ట్రక్కుల వరిగడ్డిని వితరణగా అందించారు. గోశాలలో గోవులకు వరగడ్డి కొరత ఉందని మంత్రి దృష్టికి రావటంతో మంత్రి ఆదేశాలతో వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుపాకుల యలగొండ స్వామి 20 టక్కుల గడ్డిని సోమవారం గోశాలకు అందించారు. గోశాలలకు కావాల్సిన సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు.

ప్రజాసమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ
- గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో పద్మశ్రీ

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ప్రజలు వెల్లడించిన వారి సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందించాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ అన్నారు. ప్రజావాణిలో ప్రజలు అందించే అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రీవెన్స్‌లో డీఆర్డీవో సన్యాసయ్యతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తల్లాడ మండలం వెంకటగిరి గ్రామస్థులు డి. వీర నారాయణ, తనకు నీటి పారుదలశాఖలో ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆర్డరు ఇచ్చారని, హై కోర్టు ఆర్డర్ ప్రకారం తనకు ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ల్యాండ్‌సర్వే ఏడీ శ్రీనివాసులు, కారుమంచి శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి బాయి, ఉపాధికల్పన అధికారి ఎన్ మాధవి, మిషన్‌భగీరథ ఈఈ పుష్పలత, వాణిశ్రీ , కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

2013 భూ చట్టం అమలు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా



సీపీఎం నాయకుల పాదయాత్ర

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని భూ బాధితులకు 2013 భూ పరిహార చట్టం అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం కాల్వొడ్డులోని మంచికంటి నగర్‌లో సీపీఎం నాయకులు పాదయాత్ర చేపట్టారు. మున్నేరు భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అద్దెకు ఉంటున్నవారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, వజినేపల్లి శ్రీనివాసరావు, షేక్ నాగుల్‌మీరా, బోడపట్ల సుదర్శన్, ఎల్లంపల్లి వెంకట్రావ్ పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బార్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు సోమవారం మధిరలో మర్యాదపూర్వకంగా కలిశారు. - ఖమ్మం లీగల్

విజయవంతమైన నేత్ర వైద్య శిబిరం

నేలకొండపల్లి, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ఓ ప్రైవేటు కంటి వైద్యశాల ఆధ్వర్యంలో నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరం విజయవంతమైంది, శిబిరంలో రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో ఆపరేషన్లు అవసరమైన వారికి అతి తక్కువకే ఆపరేషన్‌ను చేయనున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ధనరాజ్, డాక్టర్ జక్కంపూడి లిఖిత వైద్య సేవలందించారు. సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి గెల్లా జగన్మోహన్‌రావు,కాసాని నాగేశ్వరరావు, అనంతు సత్యనారాయణ శిబిరం విజయవంతానికి సహకరించారు.

ఘనంగా సీమంతం



నూతన వస్త్రాలు అందిస్తున్న సీడీపీవో

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పోషన్ పక్వాడలో భాగంగా సోమవారం ఖమ్మం అర్బన్ ప్రాజెక్టు నిజాంపేట సెక్టార్ పరిధిలోని మోమినాన్ పాఠశాలలో సీమంతం వేడుక ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ సీడీపీవో వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ విజయకుమారి గర్భిణులకు నూతన వస్త్రాలను, పూలు, పండ్లు, గాజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

చలివేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం: సీపీఐ



నిర్వహణ సరిగా లేదని చూపుతున్న సీపీఐ నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ప్రజల దాహార్తి కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాలు సరైన నిర్వాహణ లేక పోవటంతో బొంత పరుగులు గూళ్లు పెడుతున్నాయని సీపీఐ సీనియర్ నాయకుడు మహ్మద్ సలామ్ ఆరోపించారు. సోమవారం ఖమ్మం నగరంలో ఖమ్మం నగర పాలక సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన చలివేంద్రాలను నాయకులు పరిశీలించారు. మట్టి కుండల్లో నీళ్ల ప్రతీ రోజు మార్చకపోవడంతో బూజు పట్టి బొంత పురుగులు వ్యాపించాయని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనే శశిధర్,జ్వల నర్సింహారావు, చాన, శేఖర్, రమణ, దుర్గానాథ్, మజీద్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణారావు

న్యూఇరా విద్యాసంస్థల్లో ఐన్‌స్టీన్ మెమోరియల్ వీక్ వేడుకలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూఇరా పాఠశాలలో సోమవారం ఐన్‌స్టీన్ మెమోరియల్ వీక్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల చైర్మన్ ఐవీ రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి. భూమేశ్వరరావు, మరిపెడ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల సృజనాత్మకతను, విజ్ఞానాన్ని పెంపొందించటంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

రహదారులే కల్లాలు!

- రోడ్డుపై అడ్డంకులతో ప్రమాదాలు
- అవగాహన కల్పించినా ఫలితం శూన్యం

కూసుమంచి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఆయకట్టు, బోర్లు, బావులు కింద సాగుచేసిన వరిపంట ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంతో ఆనందం వ్యక్తం చేస్తుండగా.. మరోవైపు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి వరి కల్లాలు లేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. దీంతో ధాన్యం ఆరబెట్టుకోవడానికి రహదారులను ఆశ్రయిస్తున్నారు. ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై సర్వీసురోడ్డుపై నిత్యం పెద్దసంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. కూసుమంచి-నేలకొండపల్లి రహదారిలోనూ, కూసుమంచి- జక్కేపల్లి రహదారిలోనూ పెద్దసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. రాత్రి వేళల్లో వాహనాలు ధాన్యం కుప్పలపైకి దూసుకెళ్లి ప్రయాణికులు ప్రమాదాలబారిన పడిన సంఘటనలు ఉన్నాయి. రహదారులపై ధాన్యం రాశులు పోసి పట్టాలు కప్పి పక్కన పెద్ద బండరాళ్లు పెట్టడం వలన అవి కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పెడచెవిన పెడుతున్నరైతులు

ఇటీవల జాతీయ రహదారి భద్రతాధికారులు పాలేరు, నాయకన్‌గూడెం, కూసుమంచి, జీళ్లచెరువు, నేలపట్ల రహదారి పక్కగా ఉండే గ్రామాల రైతులకు అవగాహన ఏర్పాటు చేశారు. రహదారుల వెంట ధాన్యం, మిర్చి పంటలు ఆరబెట్టడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అయినప్పటికీ రైతులు మాత్రం పెడచెవిన పెడుతున్నారు. సుమారు రెండు నెలల పాటు ఈప్రాంతంలో వరికోతలు జరుగుతుండగా సీజన్ మొత్తం రహదారిపైనే పోస్తున్నారు.

రహదారులపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

ప్రధాన రహదారులపై రైతులు ధాన్యం రాశులు పోస్తే చర్యలు తీసుకుంటామని కూసుమంచి సీఐ సంజయ్ హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో, వ్యవసాయక్షేత్రాల్లో, ఖాళీస్థలాల్లో మాత్రమే ధాన్యం ఆరబెట్టుకోవాలన్నారు. రోడ్లపై ఆరబోసిన ధాన్యంతో ఎవరైనా వాహనదారులు ప్రమాదాలకు గురైతే.. ధాన్యం ఆరబోసిన రైతుపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రైతులు సహకరించి ప్రమాదాలు నివారించాలని అన్నారు.



నాయకన్‌గూడెం వద్ద రహదారిపై ఆరబోసిన ధాన్యం

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన వరి, మొక్కజొన్న పంట
- రాలిపోయిన మామిడికాయలు

తల్లాడ, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి బలమైన ఈదురుగాలుతతో కూడిన భారీవర్షానికి మామిడి, వరి పంటలకు నష్టం జరిగింది. మండలంలోని అన్నారుగూడెం, గోపాలపేట, బిల్లుపాడు, మల్లవరం, గొల్లగూడెం, నారాయణపురం తదితర గ్రామాలలో ఈదురుగాలులతో ఆదివారం రాత్రి 10గంలలనుంచి 12గటల వరకువర్షంపడింది. దీంతో మండంలోని వివిధ గ్రామాలలో కోతకు వచ్చిన వరి నేలకొరిగింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిచిపోయింది. మామిడిచెట్లకున్న కాయలు నేలరాలాయి. పిడుగుల ధాటికి తల్లాడ, నారాయణపురం, మల్లవరం, గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.



తల్లాడలో నేలరాలిన మామిడికాయలు



వైరాలో నెలకొరిగిన మొక్కజొన్న పంట

వైరా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఆదివారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. రాత్రి పదిన్నరగంటల సమయంలో అకస్మాత్తుగా భారీ ఈదురుగాలులతో కుండపోత వర్షం కురిసింది. దాంతో వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసుకున్న ధాన్యం తడిసిపోయింది. వర్షపు నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. గత మూడురోజులుగా పగటిపూట తీవ్ర ఉక్కపోత, ఎండతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మార్కెట్‌యార్డులో ధాన్యం ఆరబోసిన రైతులు ముందుగానే టార్పాలిన్ పట్టాలు కప్పారు. అయినప్పటికీ భారీ వర్షంతో వరదనీరు ప్రవహించడంతో ధాన్యం రాశుల అడుగు నుంచి నీరు ప్రవహించి కొట్టుకుపోయింది. సోమవారం తడిసిన ధాన్యాన్ని రైతులు మళ్లీ ఆరబెట్టారు. రైతుసంఘం ప్రతినిధి బృందం తడిసిన ధాన్యాన్ని పరిశీలించింది. ఎలాంటి షరతులు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు.



తల్లాడలో నెలకొరిగిన వరి పంట



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

పండ్ల వ్యాపారితో ముచ్చటించిన భట్టి

చింతకాని, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మధిర పర్యటనకు ముగించుకుని హైదరాబాద్ వెళ్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గమధ్యలో మండల పరిధిలోని మత్కేపల్లి నామవరం క్రాస్‌రోడ్డు సమీపంలో పండ్లు విక్రయిస్తున్న వంగ నాగమణితో మాట్లాడారు. కుటుంబ యోగక్షేమాలు, ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాల గురించి చర్చించారు. భట్టి వెంట మండల నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, బండెల నాగార్జున, కంచుమర్తి రామకృష్ణ పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న భట్టి

ముదిగొండలో...

ముదిగొండ: ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి బుచ్చిరామయ్య, ఝాన్సీల చిన్నకుమారుడు అఖిల్-రేవతిలకు ఇటీవల వివాహమైంది. సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, అఖిల్-రేవతి నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న ధా న్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సూచించారు. మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో సోమవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సన్నరకం ధాన్యం సాగుబడిని ప్రోత్సహించేందుకుగానూ క్వింటా ఒక్కింటికి రూ.500బోనస్‌ను ప్రభు త్వం ఇస్తుందని పేర్కొన్నారు. రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ అనేక కార్యక్రమాలు అమలుచేస్తుందని తెలిపారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, నాయకులు నూతి వెంకటేశ్వరరావు, పమ్మి అశోక్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, మల్లు పట్టయ్య, మోరంపూడి మధు, తోటకూర గోపి, ఏఈవో రాజేష్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కూరగాయల దుకాణాలు కేటాయించాలని వినతి

వైరా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పూర్వపు కూరగాయల మార్కెట్ స్థలంలో అర్హులైన వారందరికీ దుకాణాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం వైరా మునిసిపల్ కార్యాలయం ముందు కొంతమంది కూరగాయల వ్యాపారులు ధర్నా చేశారు. 2022లో అర్హులైన 47 మంది కూరగాయల వ్యాపారులకు స్థలాలు కేటాయిస్తామని గత ప్రభుత్వం 105దుకాణాల సముదాయాన్ని నిర్మించతలపెట్టిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దుకాణ సముదాయ నిర్మాణాన్ని నిలిపివేసిందని ఆరోపించారు. దుకాణ కేటాయింపుల్లో అధికార పార్టీకే ఎక్కువ కేటాయింపు లు చేసి అర్హులైన తమ పట్ల వివక్షత చూ పుతున్నారని పేర్కొన్నారు. తమకు దుకాణా లు కేటాయించాలని ఈ ఆందోళన చేశారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణుకు వినతిపత్రం అందజేశారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్సు వితరణ

తల్లాడ, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో పగడాల కన్నయ్య, దర్గమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమార్తెలు ఫ్రీజర్‌బాక్సును రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ సమక్షంలో గ్రామపంచాయతీకి అందించారు. దర్గమ్మ దశదిన కార్యక్రమం సందర్భంగా ఫ్రీజర్ బాక్సును గ్రాపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు అప్పగించారు. ఈకార్యక్రమంలో బ్లాక్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, ఏఎంసీ మాజీచైర్మన్ దివ్వెల కృష్ణయ్య, తాళ్ల జోసఫ్, నరసింహరావు, రాయల రాము, తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.

రక్తహీనత పరీక్షలు

వైరా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపూడిలో ఉన్న ఆయుర్వేద డిస్పెన్సరీ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం జడ్పీ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, పోషకాహారం ప్రాముఖ్యత, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ జి.రాకేష్ అవగాహన కల్పించారు. యోగా ఆవశ్యకత గురించి శిక్షకులు పద్మావతి, మిక్కినేని కృష్ణ వివరించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు విజయబాబు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

తల్లాడ, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దునూరు గ్రామానికి చెందిన ఇనపనూరి శిరీష అనే గర్భిణి పురిటినొప్పులు రావడంతో 108 సిబ్బందికి సమాచారం అందించారు. 108 సిబ్బంది ఆమెను ఎక్కించుకుని ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువకావడంతో గమనించిన ఈఎంటీ నల్లగట్ల రామారావు ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. ఇందు కు పైలట్ కృష్ణ, ఆశావర్కర్ రాములమ్మ సహకరించారు.

లారీ, బైక్ ఢీ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని రింగ్‌సెంటర్‌లో సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోస్టాఫీస్ సెంటర్ నుంచి ఎన్టీఆర్‌నగర్ వెళ్లేందుకు ఓ ద్విచక్ర వాహనదారుడు రింగ్ సెంటర్ మీదుగా వేంసూర్ రోడ్డు వైపు వెళ్తుండగా, అదే సమయంలో రాజమండ్రి వైపు నుంచి ఖమ్మం వెళ్తున్న కంటెయినర్ లారీ రెడ్ సిగ్నల్ పడినా ఆగకుండా వెళ్తూ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ కిందకు బైక్ దూసుకెళ్లింది. ద్విచక్ర వాహనదారుడికి ఎలాంటి గాయాలవ్వకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తరచూ ఇలా రింగ్ సెంటర్ వద్ద రెడ్ సిగ్నల్ పడినా వాహనాలు ఆపకుండా వెళ్లడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సత్తుపల్లిలో పోషణపక్షం కార్యక్రమం



సత్తుపల్లిలో గర్భిణికి సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డ జీవితంలో మొదటి 1000రోజుల వ్యవధి జీవితకాల ఆరోగ్యానికి, అభివృద్ధికి పునాది అని సత్తుపల్లి తహసీల్దార్ కే.యోగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి ఐసీడీఎస్ పరిధిలోని అయ్యగారిపేట సెక్టార్ ఆధ్వర్యంలో పోషణా పక్షం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐకేపీ కార్యక్రమంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ పక్వాడా ఆవశ్యకతను తెలియజేసేలా చిన్నారుల చిత్రాలు, పోషకాహారం అందించే వంటకాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.కనకదుర్గ మాట్లాడారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఐకేపీ ఏపీఎం రాజు, సూపర్‌వైజర్ మహాలక్ష్మీ, ఎంపీవో కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

వైరా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లోని స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం వైరాలో ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మండలంలోని 22గ్రామపంచాయతీల్లో స్థానికంగా ఉన్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఆపంచాయతీల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరు తూ వందలాదిమందితో ర్యాలీ, ధర్నా చేపట్టారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు, పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం హెచ్చరించారు. అక్కడే ప్రజావాణిలో ఉన్న తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎంపీడీవో సరస్వతీకి వినతిపత్రాలు అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, మాగంటి తిరుమలరావు, కిలారు శ్రీనివాసరావు, బాణాల వెంకట్రావమ్మ, బాజోజు రమణ, తుమ్మల జాన్‌పాపయ్య, చిత్తారు నాగరాజు, శరాబందీ, సుబ్బారావు, షేక్.మోహిద్దీన్, జానిమియా, మజీద్, రుద్రాక్షల వెంకటాచారి పాల్గొన్నారు.



తహసీల్దార్, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వైరా ఆర్టీసీలో కార్గోసేవలు పునఃప్రారంభం

వైరా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సేవలను సోమవారం మధిర డీఎం శంకర్‌రావు పునఃప్రారంభించారు. కొంతకాలంగా వైరా బస్టాండ్‌లో కార్గో సేవలు నిల్చిపోయాయి. తిరిగి మళ్లీ ఆ సేవలను డీఎం శంకర్‌రావు పునఃప్రారంభించారు. ప్రజలు ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్గో ఆపరేషన్ టీమ్ లీడర్ షేక్.మునీర్‌బాషా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉపేందర్, వైరా స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, కంట్రోలర్ ఏజెంట్ సీహెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మార్కెట్ ఆదాయం పెంపుపై ప్రత్యేక చర్యలు

ఏన్కూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ ఆదాయ పెంపుపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మార్కెటింగ్‌శాఖ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ వి.పద్మావతి తెలిపారు సోమవారం ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ ఆదాయం ఒక్కసారిగా తగ్గడంపై ఆమె ఆకస్మికంగా సందర్శించారు ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో జరిగే మిర్చి కొనుగోళ్లను పరిశీలించారు. ఎప్పుడు లక్ష్యానికి మించి వచ్చే ఆదాయం ఇప్పుడు ఎందుకు తగ్గుతుందని సిబ్బందిని అడిగారు. వరంగల్ ఆర్డర్స్ పరిధిలో ఏడాది లక్ష్యం రూ.449 కోట్లు కాగా రూ.458కోట్లు లక్ష్యానికి మంచి ఆదా యం వచ్చిందన్నారు. ఎప్పటికప్పుడు మార్కెట్ చెక్‌పోస్టును తనిఖీచేయాలని సెక్రెటరీని ఆదేశించారు.

'బీఆర్ఎస్ సభను జయప్రదం చేయాలి'

మధిరరూరల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కోరుతూ మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో 5,6,7 వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పుచ్చకాయల వెంకటనారాయణ, నీలం హనుమయ్య, పగడాల వీరభద్రం, అయిలూరి ఉమామహేశ్వరరెడ్డి, రాంబాబు, అరిగే శ్రీను, వైవీ అప్పారావు పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల శాంతి ర్యాలీ



సత్తుపల్లిలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): రోమన్ కాథలిక్ చర్చి మొదటి లాటిన్ అమెరికన్ నాయకుడు పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల చింతిస్తూ పట్టణంలో మౌంట్ కార్మెల్ మాత చర్చ్ (ఆర్‌సీఎం) సత్తుపల్లి విచారణ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక జ్యోతి నిలయం వద్ద నుంచి పట్టణంలో కొవ్వొత్తులు వెలిగించి విచారణ గురువులు, బాధ్యులు, క్రైస్తవులు ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక రింగ్‌సెంటర్ వద్ద ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షిస్తూ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో విచారణ గురువు ఫాదర్ కృప (ఓసీడీ), సహాయక గురువులు ఫాదర్ మేరియో (ఓసీడీ), ఫాదర్ జ్యాన్సేష్, సంఘ పెద్దలు బీ.వెంకటేశ్వర్లు, ఆనంద్, ఇన్నయ్య, సురేష్, ప్రకాష్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మంత్రులను విమర్శించే అర్హత కవితకు లేదు'

కల్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంతోపాటుగా జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవితకు లేదని కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. సోమవారం కల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు, లక్కినేని కృష్ణ మాట్లాడారు. లింగాల గ్రామంలో ఓ శుభకార్యానికి హాజరైన కవిత ఆ కార్యక్రమానికే పరిమితం కాకుండా ప్రభుత్వంపై రాజకీయ దుమారం లేపేలా అవాస్తవమైన ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తక్కెళ్లపాటి ప్రసాద్, ఏనుగు సత్యంబాబు, పాపబత్తిని నగేష్, పెద్దబోయిన శ్రీనివాసరావు, పుల్లారావు, కేవీ, జిల్లేళ్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను లూటీ చేస్తున్న మోదీ ప్రభుత్వం

- వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్

కొణిజర్ల, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మికచట్టాలను రద్దు చేస్తూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆదాని, అంబానీలకు తాకట్టు పెడుతూ దేశ సంపదను లూటీ చేస్తున్నారని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ విమర్శించారు. సోమవారం మండల పరిధిలోని పల్లిపాడు గ్రామంలో జరిగిన వ్యవసాయకార్మికసంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి పనికి వెళ్లుతున్న కూలీలు కనీససౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, తాళ్ళపల్లి కృష్ణ, వత్సవాయి జానకిరాములు, శ్రీనివాసరావు, వడ్లమూడి నాగేశ్వరరావు, వెంకట్, రాములు, నరసారావు, సుధాకర్, రత్తమ్మ, శ్రీను, వెంకటేశ్వరరావు, వెంకన్న, తిరుపతిరావు, లెనిన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న బుర్రి ప్రసాద్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు

బోనకల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్క క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడూరి ఉమ, కొమ్మినేని నాగేశ్వరరావు, గూడూరి వెంకటనర్సయ్య, పత్తి రాధాకృష్ణ తదితరులున్నారు.

ముందస్తు బడిబాట కార్యక్రమం



బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ముందస్తు బడిబాట కార్యక్రమం నినర్వహిస్తున్నారు. ఈసందర్భంగా సోమవారం గ్రామాల్లో బడిబాట ర్యాలీలు నిర్వహించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తిచూపుతున్నారని ఎంఈవో మురళీమోహన్ రావు తెలిపారు. రాబోయే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

24న సుబ్రహ్మణ్యస్వామి విగ్రహప్రతిష్ఠ

మధిరరూరల్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): మాటూరు గ్రామంలో ఈ నెల 24వతేదీన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించబడతుందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బాల అవధానులు భళా...

సత్తుపల్లి, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): స్వయంకృషితో వేమన శతక అవధానాన్ని నేర్చుకుని విద్యార్థులు భళా అనిపించారని గార్లపాటి, బొల్లేపల్లి ట్రస్ట్ నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదనరాజులు అన్నారు. సోమవారం సత్తుపల్లిలోని ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులు షేక్ హజ్రి దా, బిల్లా కృష్ణ సాత్వికలు 8అంశాలపై ప్రదర్శన ఇచ్చి ఔరా అనిపించారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ వీరు కొద్దికాలంగా ప్రభుత్వ ప్రయివేటు విద్యా సంస్థల్లోని విద్యార్థులు వేమన శతకంపై అష్టావధానం చేయడాన్ని వీరు నిశితంగా పరిశీలించి స్ఫూర్తి పొందారన్నారు. అనంతరం విద్యార్థులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రమణమూర్తి, కిషోర్, శైలజ, దుర్గ, మణి తదితరులున్నారు.



బాల అవధానులను సన్మానిస్తున్న దృశ్యం

అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ గోబ్యాక్ అంటూ నిరసన

వైరా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ భారత్ రాకను నిరసిస్తూ వాన్స్ గోబ్యాక్ అనే నినాదాలతో సోమవారం వైరాలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. భారత వ్యవసాయ మార్కెట్‌ను కబళించే యత్నంలో భాగంగానే అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ ఈ పర్యటనకు వస్తున్నారని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆరోపించారు. వాన్స్ గోబ్యాక్ అమ్మకానికి ఇండియా లేదంటూ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, రైతు సంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, మేడా శరాబందీ, తుమ్మల జాన్ పాపయ్య, బాణాల కృష్ణమాచారి, సంక్రాంతి పురుషోత్తం, వడ్లమూడి మధు, యనమద్ది రామకృష్ణ, గుమ్మా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

బోనకల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో సోమవారం మహిళ పై లైగింక దాడికి యత్నించిన వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుబాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన 55 సంవత్సరాల మహిళ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన రవి కుమార్ లైంగిక దాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ సంఘటన పై బాధిత మహిళ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ దర్యాప్తు జరుపుతున్నారు.

28న సత్తుపల్లిలో భూభారతిపై అవగాహన

సత్తుపల్లి, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి):సత్తుపల్లిలోని ఎమ్మార్ గార్డెన్స్‌లో ఈనెల 28న భూ భారతి పోర్టలపై అవగాహన సదస్సు నిర్వహిస్తునట్లు సత్తుపల్లి తహసీల్ధార్ కే.యోగేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్ధార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సదస్సుకు మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు. కాగా ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో పాటు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, రైతులు, రైతు సంఘ నాయకులు హాజరవుతాయని తెలిపారు.